PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 88 | విజయవాడ, ఆదివారం 29 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు+స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 29 October 2023 | Rs

సిటీ◆

భారత్ గైర్హాజరు దిగ్భ్రాంతి కలిగించింది

- సిపిఎం, సిపిఐ విమర్శ

5



111 పతకాలతో 5వ స్థానంలో భారత్

- ముగిసిన 4వ ఆసియా పారా క్రీడలు

6



ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఇజ్రాయిల్ దాడులపై ఓటింగ్ వివరాలు

తక్షణం దాడులు ఆపేయాలి

- గాజాకు సాయం పెంచాలి
- ఐరాస సర్వప్రతినిధుల సభ తీర్మానం
- భారీ మెజారిటీతో ఆమోదం
- ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు

న్యూయార్క్ : ఇజ్రాయిల్, హమాస్ మధ్య తక్షణమే మానవతా సంధి కుదరాలని పిలుపునిస్తూ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభ అత్యధిక మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించింది. 22 అరబ్ దేశాల గ్రూపు ఈ తీర్మానాన్ని రూపొందించగా, 120-14 ఓట్ల తేడాతో జనరల్ అసెంబ్లీ దీనిని ఆమోదించింది. భారత్ మరో 44 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజర య్యాయి. ఊహించిన విధంగానే ఇజ్రాయిల్, అమెరికా, దాని మిత్ర పక్షాలు దీనికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. ఓటింగ్‌కు ముందు జోర్డాన్ విదేశాంగ మంత్రి ఐమన్ సఫాది మాట్లాడుతూ, తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడమంటే అర్థం లేని ఈ యుద్ధాన్ని, విచక్షణారహితమైన హత్యాకాండను ఆమోదించడమేనని అన్నారు. ఇజ్రాయిల్ గత మూడు వారాల్లో నాలుగు సార్లు ఐరాస తీర్మానాలను ధిక్కరించింది. జనరల్ అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కూడా అది బేఖాతరు చేస్తూ, వైమానిక, భూతల దాడులను మరింత ఉధృతం చేసింది. గాజాలో ఇజ్రాయిల్ దాష్టీకాలను ఆపేందుకు చర్యలు తీసుకోవడంలో భద్రతా మండలి విఫలం కావడంతో జనరల్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది.

తక్షణమే, శాశ్వతమైన, సుస్థిరమైన మానవతా సంధి కుదుర్చుకుని ఘర్షణలు విరమించాలని శుక్రవారం ఐరాస ఆమోదించిన తీర్మానం పిలుపునిచ్చింది. పాలస్తీనియన్లను బలవంతంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళగొట్టే ప్రయత్నాలను అది నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. గాజాకు మానవతా సాయాన్ని మరింతగా పెంచాలని, బందీలుగా వుంచిన పౌరులందరినీ తక్షణమే విడుదల చేయాలని తీర్మానం కోరింది. ఇజ్రాయిల్ పౌరులపై దాడులతో సహా అన్ని రూపాల్లోని తీవ్రవాద చర్యలను, విచక్షణారహిత దాడులను ఖండించింది.

కాల్పుల విరమణ అంటే హమాస్‌కు తిరిగి ఆయుధాలు సమకూర్చుకోవడానికి సమయం ఇవ్వడమేనని ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయిల్ రాయబారి గిలాద్ ఎర్డాన్ వ్యాఖ్యానించారు. అత్యవసర సమావేశంలో కాల్పుల విరమణ జరగాలని కోరుతూ పలువురు వక్తలు మాట్లాడారు.

బాంబు దాడులు ఆపండి

బాంబు దాడులను ఆపి, ప్రాణాలను కాపాడాలని పాలస్తీనా రాయబారి విజ్ఞప్తి చేశారు. జనరల్ అసెంబ్లీ అత్యవసర సమావేశంలో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. 'మృతుల్లో 70శాతం మంది చిన్నారులు, మహిళలే, ఇలాంటి యుద్ధాన్నా మీరు సమర్థించేది?' అని ఆయన ప్రశ్నించారు. ఇవన్నీ యుద్ధ నేరాలు, ఆటవిక చర్యలేనని విమర్శించారు. చనిపోయిన వారు చనిపోగా, మిగిలిన వారిని కాపాడేందుకైనా ఈ యుద్ధాన్ని ఆపాలని ఆయన కోరారు. హమాస్‌ను సమూలంగా నిర్మూలించేవరకు దాడులు ఆపేది లేదని ఇజ్రాయిల్ రాయబారి మరోమారు హూంకరించారు.



మళ్లీ తగ్గిన విదేశీ మారకం నిల్వలు

- వారం రోజుల్లో 2.36 బిలియన్ డాలర్ల క్షీణత

ముంబయి : భారత విదేశీ మారకం నిల్వల్లో మళ్లీ తగ్గుదల చోటు చేసుకుంది. ఈ నెల 20తో ముగిసిన వారంలో 2.36 బిలియన్ డాలర్లు క్షీణించాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. దీంతో అక్టోబర్ 20 నాటికి దేశంలోగల ఫారెక్స్ నిల్వలు 583.53 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతకుముందు అక్టోబర్ 6 నుంచి 13 మధ్య 1.153 బిలియన్ డాలర్లు పెరిగాయి. వరుసగా నెల రోజులకుపైగా పడిపోయిన విదేశీ మారకపు నిల్వలు.. ఒక్క వారం పెరిగినట్టే పెరిగి తిరిగి పతనం కావడం గమనార్హం. దీంతో సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 20 వరకు 15 బిలియన్ డాలర్లకు పైగానే దేశీయ ఫారెక్స్ నిల్వలు పడిపోయినట్లయ్యింది. మనదేశ ఎగుమతులు పడిపోవడం, దిగుమతులు పెరగడంతో ఇటీవల కాలంలో రిజర్వ్ నిధులపై ఒత్తిడి పెరిగింది. డాలర్‌తో రూపాయి విలువ తగ్గడం, విదేశీ చెల్లింపుల భారం పెరగడం మారకం నిల్వలు కరిగిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. విదేశీ మారకం నిల్వలు తగ్గడం ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరం. రూపాయిపై ఒత్తిడి నెలకొంటుంది. ముడి చమురు దిగుమతులు భారమవుతాయి. ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుంది. నిత్యావసర వస్తువులుసహా వివిధ వస్తువులు, సేవలపై పెరిగిన ధరలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

సమీపిస్తున్న డెడ్‌లైన్

కేంద్ర మాన్యువల్ ప్రకారం అక్టోబర్ 31 గడువు

- అయినా కరువు ప్రకటనపై సర్కారు తాత్సారం
- దుర్భిక్షంపై ఆది నుంచీ అంతే
- ముందస్తు సంసిద్ధతపైనా నిర్లక్ష్యమే



కర్నూలు జిల్లా సి.బెళగళ మండలంలో ఎండిపోయిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కరువు ప్రాంతాల ప్రకటనకు సమయం ముంచుకొస్తోంది. కేంద్రం 2020లో నిర్దిష్టపరిచిన కరువు మాన్యువల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్‌లో కరువును అక్టోబర్ 31 లోపు ప్రకటించాలి. ఏదైనా ప్రత్యేక పరిస్థితులుంటే అదనంగా గరిష్ఠంగా మూడు వారాల వ్యవధి ఉంటుంది. అందుకు కేంద్రానికి రాష్ట్ర సర్కారు సహేతుక కారణాలతో అభ్యర్ధన పంపి ఆమోదం తీసుకోవాలి. లేకపోతే అక్టోబర్ 31 తర్వాత కరువు ప్రకటనకు ఆస్కారం లేదు. నిబంధనలు ఈ విధంగా ఘోషిస్తుండగా ఎపి ప్రభుత్వం మాత్రం అక్టోబర్ 31 సమీపిస్తున్నా కరువు ప్రకటనపై మీనమేషాలు లెక్కించడంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వైసిపి సర్కారు వచ్చాక మూడేళ్లలో కరువు మండలాలను ప్రకటించలేదు. వర్షాలు పుష్కలంగా కురిసినందున ఆ అవసరం రాలేదని చెబుతోంది. అయితే నిరుడు 300 పైగా మండలాలు కరువు ప్రకటనకు అర్హమైనవిగా జిల్లా యంత్రాంగాలు ప్రతిపాదించినా సగటు వర్షపాతం లెక్కల ఆధారంగా కరువును గుర్తించలేదు. ఈ తడవ కూడా అదే బాణీ ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

వైఎస్‌నూ పట్టించుకోలేదు


ఖరీఫ్‌లో కరువు నివారణా చర్యలపై ప్రభుత్వంలో ఏ కొంచెం కూడా ముందస్తు సంసిద్ధత లేదు. 2005లో అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం విపత్తు నిర్వహణ చట్టం తెచ్చాక, దాని అమలుకు 2007 నవంబర్ 14న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జిఒఎంఎస్ నెం.1436 జారీ చేశారు. విపత్తులను ఎదుర్కొనేందుకు అప్పుడే సిఎం నేతృత్వంలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డిఎంఎ) నెలకొల్పారు. రాష్ట్రస్థాయిలో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఎస్ఇసి), జిల్లాల స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (డిడిఎంఎ)లను ఏర్పాటు చేశారు. ప్రతి సీజన్‌లో ఈ కమిటీలు పరిస్థితులపై సమీక్షించి ముందస్తుగా అప్రమత్తమై నివారణా, సహాయక చర్యలను పర్యవేక్షించాలి. కరువు మాన్యువల్ ప్రకారం జూన్, జులై, ఆగస్టు మాసాల్లోనే వాతావరణ పరిస్థితులపై అంచనాకు రావాలి. కంటింజెన్సీ ప్లాన్లు రూపొందించి అమలు చేయాలి. వర్షాభావం, డ్రైస్పెల్స్, సాగునీటి కొరత, సేద్యం తగ్గుదల సంకేతాలు కనిపిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. మొక్కుబడి సమావేశాలకే యంత్రాంగం పరిమితమైంది. కొద్దిపాటిగా కంటింజెన్సీ సీడ్ ప్లాన్ తప్ప మరే చర్యా చేపట్టలేదు.

ఇండికేటర్స్ ఊసే లేదు

కరువు మాన్యువల్ ప్రకారం కరువును రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ యూనిట్లుగా ప్రకటించవచ్చు. గెజిట్ పబ్లికేషన్ చేయాలి. వర్షాభావం, డ్రైస్పెల్, రిజర్వాయర్లు, చెరువులలో నీటి లభ్యత, సాగు తగ్గుదల, భూగర్భ జలాల తగ్గుదల, రిమోట్ సెన్సింగ్, భూమిలో తేమ శాతం తదితర సూచిలు పేర్కొన్నారు. వాటిలో కొన్ని సరిపడినా కరువు ప్రకటించాలి. మోస్తరు, మధ్యస్థ, తీవ్ర మూడు కేటగిరీల్లో కరువును ప్రకటించొచ్చు. పరిస్థితులను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగు, పంట నష్టాలకు ఆర్థిక సాయం, బీమా, ఉపాధి కల్పన, తాగునీరు, పశువులకు తాగునీరు, గ్రాసం, బ్యాంకు అప్పుల వాయిదా వంటి ఎన్నో ఉపశమన చర్యలు ప్రతిపాదించారు. ఆర్థిక సంఘం విపత్తులకు కేటాయించిన నిధులే కాకుండా విపత్తు తీవ్రతను బట్టి ఎన్‌డిఆర్ఎఫ్ సహాయం కోసం రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి వినతిపత్రం ఇవ్వాలి. అది కూడా విపత్తు ప్రకటన చేసిన వారంలోపు అందజేయాలి. ఖరీఫ్‌లో 25 లక్షల ఎకరాల్లో సాగు లేకపోయినా, వర్షాభావం, డ్రైస్పెల్స్, రిజర్వాయర్లలో సాగునీటి కొరత వలన లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా, దిగుబడి నష్టం భారీగా ఉన్నా రాష్ట్ర సర్కారు కరువు ప్రకటనపైనా, కేంద్రాన్ని సహాయం అడిగే విషయంలోనూ తాత్సారం చేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాలుగేళ్లలో రూ.1.2 లక్షల కోట్ల ఎగవేత

- సగటున రోజుకు రూ.100 కోట్లకు పైబడే
- ట్రాన్స్‌యూనియన్ సిబిల్ వెల్లడి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఉద్దేశపూర్వక ఎగవేతల సొమ్ము అంతకంతకూ పెరిగిపోయింది. ప్రజలు దాచుకున్న సొమ్మును బ్యాంకుల నుంచి రుణాల రూపంలో కాజేసిన బడా పెట్టుబడిదారులు, కంపెనీలు ఉద్దేశపూర్వకంగా చెల్లించని సొమ్ము 2019 మార్చి నుంచి రూ.1.2 లక్షల కోట్లు ఉన్నట్లు వెల్లడైంది. యుపిఎ ప్రభుత్వం 'స్కామ్‌ల'తో బ్యాంకింగ్ రంగాన్ని నాశనం చేసిందని, తమ ప్రభుత్వం 'మంచి ఆర్థిక ఆరోగ్యాన్ని' పునరుద్ధరించిందని ప్రధాని నరేంద్ర మోడీ జులై 22న ప్రకటన చేశారు. ఆయన ప్రకటనకు భిన్నంగా... ఎగవేతదారులు చెల్లించాల్సిన బకాయిల మొత్తం సగటున రోజుకు రూ.100 కోట్లకు పైగా పెరిగింది. వరుసగా నాలుగు త్రైమాసికాల్లో మొత్తం రూ.3 ట్రిలియన్ మార్క్ కంటే ఎక్కువగానే ఉందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ డేటా తెలిపింది. ప్రభుత్వ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే అటువంటి రుణాల పెరుగుదల చాలా తక్కువగా ఉంది. ఈ ఏడాది జూన్‌లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు చెల్లించాల్సిన డబ్బులో వాటా 77.5 శాతంగా ఉంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ప్రైవేట్ బ్యాంకులకు రూ.53,500 కోట్లు బకాయిపడ్డారు. 10 జాతీయ బ్యాంకులకు జూన్ నాటికి రూ.1.5 లక్షల కోట్ల బకాయిలు ఉండగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాటా రూ.80 వేల కోట్లు ఉంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల జాబితాలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. తరువాత స్థానాల్లో ఢిల్లీ, పశ్చిమబెంగాల్, గుజరాత్, తమిళనాడు ఉన్నాయి. చెల్లించాల్సిన మొత్తంలో (గత ఆర్థిక సంవత్సరం చివరి వరకు) 70 శాతం కంటే ఎక్కువ ఈ రాష్ట్రాల నుంచే ఉన్నాయి. ఈ సమయంలో బకాయి ఉన్న మొత్తం రూ.0.6 ట్రిలియన్ నుండి రూ.1.3 ట్రిలియన్లకు పెరిగింది. ఆర్‌బిఐ ఇటీవలే ఉద్దేశపూర్వక ఎగవేతదారులను రుణం నిరర్థక ఆస్తి (ఎన్‌పిఎ)గా మారిన ఆరు నెలల్లోగా ప్రకటించాలని ప్రతిపాదించింది. అక్టోబరు నెలాఖరులోగా ఈ ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్రం కోరింది. ఆర్‌టిఐ ప్రత్యుత్తరాలు, పార్లమెంటు ప్రశ్నలు, బ్యాంకు డేటా పెద్ద రుణగ్రహీతలు చెల్లించాల్సిన భారీ మొత్తంలో ప్రజాధనాన్ని వెల్లడించాయి. ది ఎకనామిస్ట్ 'క్రోనీ క్యాపిటలిజం' ఇండెక్స్‌లో ఇండియా 10వ స్థానంలో ఉంది. 2013 నుండి 'క్రోనీ-క్యాపిటలిస్ట్ సెక్టార్ల' నుండి సంపద ఇండెక్స్ ప్రకారం దాని జిడిపిలో 5 శాతం నుండి 8 శాతానికి పెరిగింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (ఆర్‌బిఐ) మొత్తం రూ.10,57,326 కోట్లు మాఫీ చేశాయని వెల్లడించారు. కరాద్ ప్రకారం, టాప్ 10 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులకు రూ.40,825 కోట్లు బకాయిపడ్డారు. మొదటి 50 మంది రుణ ఎగవేతదారులు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.87,295 కోట్లు బకాయిపడినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. పరారీలో ఉన్న మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ రూ.8,738 కోట్లతో అతిపెద్ద ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా, ఎరా ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ లిమిటెడ్ రూ.5,750 కోట్లు, ఆర్ఇఐ ఆగ్రో లిమిటెడ్ రూ.5,148 కోట్లు, ఎబిజి షిప్‌యార్డ్ లిమిటెడ్ రూ.4,774 కోట్లు, పవర్ స్లెల్ వద్ద రూ.3,911 కోట్లు రుణ ఎగవేతదారులుగా ఉన్నారు.

లోపలి పేజీల్లో

వైద్య రంగంలో దోపిడీ

- అరికట్టేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి
- ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్

పట్టుదలతోనే విజయం

- ప్రతి అభ్యర్థి సిలబస్‌పై పట్టు సాధించాలి
- గ్రూప్ పరీక్షలపై అవగాహనా సదస్సులో వక్తలు

బిజెపి చేతిలో కీలుబొమ్మలా రాష్ట్ర ప్రభుత్వం

- సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదు
- ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగే పోరాటంలో టిడిపి పాల్గొవాలి
- 30 నుంచి సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు జాతాలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. బిజెపి చేతిలో ఎపి ప్రభుత్వం కీలుబొమ్మలా మారిందని ఎద్దేవా చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన శ్రీనివాసరావు శనివారం హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సిపిఎం రాజకీయ విధానాన్ని ప్రజలకు చెప్పడం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అంశాలను ప్రజలకు వివరించే కార్యాచరణతో ప్రజా రక్షణ భేరి బస్సు జాతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండాగా ఈ నెల 30 నుంచి రాష్ట్రంలో మూడు బస్సు జాతాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. కర్నూలు జిల్లా ఆదోని, శ్రీకాకుళం జిల్లా మందస, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి విజయవాడ వరకు బస్సు జాతాలు జరగనున్నాయని తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి సభ నిర్వహించనున్నామని, ఈ సభకు సీతారాం ఏచూరి, బివి రాఘవులు హాజరవుతారని చెప్పారు.

వామపక్ష పార్టీలతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎపికి సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ, కడప ఉక్కు పరిశ్రమల అంశాలను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నది జలాల పంపకాలలో తగాదాలు పెడుతుందని విమర్శించారు. తెలంగాణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిజెపి నాటకాలు ఆడుతోందని అన్నారు. కేంద్రం అన్యాయం చేస్తుంటే రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. ఎక్కడ ఎలాంటి చట్టాన్ని తీసుకు రమ్మని చెప్తే, వైసిపి ప్రభుత్వం అలాంటి చట్టాలను రూపొందిస్తుందని విమర్శించారు. పవన్ కల్యాణ్ ఎన్‌డిఎలో ఎందుకు ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి ఏం చేసిందని ఎన్‌డిఎలో ఉన్నారని, బిజెపి, ఎన్‌డిఎను పవన్ ఎందుకు మోస్తున్నారని ప్రశ్నించారు. తెలుగువారి మిగతా 2లో

గుజరాత్‌లో ఘోరం

- ఒకే ఇంట్లో ఏడుగురు ఆత్మహత్య
- ఆర్థిక సమస్యలే కారణమని అనుమానం



అహ్మదాబాద్ : బిజెపి పాలిత గుజరాత్‌లోని సూరత్‌లో ఘోరం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఆర్థిక సమస్యల వల్ల ఈ కఠిన నిర్ణయం తీసుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ఇంట్లో సూసైడ్ నోట్ లభించినట్లు వారు తెలిపారు. సూరత్‌లోని అడాజన్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నుంచి శనివారం ఉదయం దుర్వాసన రావడాన్ని స్థానికులు గమనించి డోర్ తట్టి, బెల్ మోగించినప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఇంటి తలుపును పగులగొట్టి లోనికి వెళ్లి చూశారు. అందులో నివసిస్తున్న కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రహించారు. మృతులను మనీష్ సోలంకి (35), ఆయన భార్య రీటా(32), పిల్లలు దిశ (7), కావ్య (5), ఖుషాల్ (3), మనీష్ తల్లిదండ్రులు కాంతిలాల్ సోలంకి (65), శోభన (60)గా గుర్తించారు. కుటుంబంలోని ఆరుగురు వ్యక్తులు విషం తాగి చనిపోగా, మనీష్ ఉరి వేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లుగా రాసి ఉన్న నోట్, విషం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మనీష్ ఫర్నీచర్ వ్యాపారం చేస్తూ కాంట్రాక్టరుగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇదే అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లో నాలుగు ఫ్లాట్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చాలా కాలంగా కుటుంబంతో కలిసి ఉంటున్న అతడు చాలా మందికి డబ్బులు అప్పుగా ఇచ్చినట్లు చెప్పారు. దీపావళి పండగ సమీపిస్తున్నందున డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడని, వారు ఇవ్వకపోవడంతో తన కుటుంబ సభ్యులకు విషం ఇచ్చిన తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. అయితే ఆ కుటుంబ సామూహిక ఆత్మహత్యకు కారణం ఏమిటన్నదానిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐటి చట్టం కింద అది నేరం కాదు

- సోషల్ మీడియా పోస్ట్‌ను లైక్ చేయడంపై బాంబే హైకోర్టు

ముంబయి : సోషల్ మీడియా పోస్టులను లైక్ చేసే విషయంపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ 67 ప్రకారం సోషల్ మీడియాలో పోస్ట్‌ను లైక్ చేయడం నేరం కాదని బాంబే హైకోర్టు తెలిపింది. అయితే, అటువంటి పోస్ట్‌లను షేర్ చేయడం లేదా రీట్వీట్ చేయడం నిబంధన ప్రకారం "వ్యాప్తిచేయటం (ట్రాన్స్‌మిషన్)" అని స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 67 ఎలక్ట్రానిక్ రూపంలో అశ్లీల విషయాలను ప్రచురించడం లేదా ప్రసారం చేసే శిక్షను వివరిస్తుంది. 500 మందికి పైగా ముస్లింలు పర్మిట్ లేకుండా ఊరేగింపు కోసం సమావేశమయ్యేలా సోషల్ మీడియా పోస్ట్‌లు చేసినందుకు తనపై వచ్చిన ఆరోపణలను కొట్టివేయాలని కోరుతూ మొహమ్మద్ ఇమ్రాన్ కాజీ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు పై విధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

చంద్రబాబుపై జగన్ కక్ష సాధింపు

ములాఖత్ అనంతరం నారా లోకేష్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'చంద్రబాబునాయుడును జైలులో బంధించి 50 రోజులైంది. ఏ తప్పూ చేయకపోయినా వ్యవస్థలను మేనేజ్ చేసి ఆయనను ప్రజల మధ్యకు రానీయకుండా రాష్ట్ర ప్రభుత్వం జైల్లోనే నిర్బంధించింది' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబుతో ములాఖత్ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. 'గతంలో రాజకీయ కక్షసాధింపు చూశాం. ఇప్పుడు వ్యక్తిగత కక్షసాధింపులు చూస్తున్నాం. చంద్రబాబు జైలులోనే చనిపోతారంటూ మంత్రులు, వైసిపి ఎంపిలు, ఎంఎల్‌ఎలు స్టేట్‌మెంట్లు ఇస్తుండడంతో మా నాయకుడి భద్రతపై మాకు సందేహాలు ఉన్నాయి. నిజం గెలవాలంటూ ప్రజల్లోకి వెళ్తున్నందునే మా తల్లి భువనేశ్వరిని కూడా జైలుకు పంపుతామని మహిళా మంత్రి స్టేట్‌మెంట్ ఇచ్చారు' అని అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ స్కాం జరిగిందని చెప్తోన్న ప్రభుత్వం ఇంతవరకూ ఒక్క ఆధారాన్నీ చూపలేకపోయిందని తెలిపారు. చంద్రబాబుని జైలులో ఉంచడానికి కోట్లాది రూపాయలను లాయర్లకు ఖర్చు పెడుతోందని, ముకుల్ రోహత్గీతో వారం వారం వాయిదాలు అడుగుతూ బెయిల్ రాకుండా జాప్యం చేయిస్తోందని విమర్శించారు. 'ఈ ప్రభుత్వానికి ఛాలెంజ్ చేస్తున్నా. దమ్ముంటే ఆధారాలు బయటపెట్టాలి' అని అన్నారు. చంద్రబాబు ఎలాంటి అవినీతి చేయలేదని చెప్పారు. 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో 2.13 లక్షల మందికి శిక్షణ ఇచ్చింది నిజం. 85 వేలమందికి ఉద్యోగాలు ఇచ్చింది నిజం. ఫైబర్ గ్రిడ్‌లో పది లక్షల కనెక్షన్లు ఇచ్చింది నిజం. ఏటా వంద కోట్ల రూపాయలు టర్నోవర్ చేస్తోన్న ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు నిజం. గత నాలుగేళ్లలో ఒక్కసారి కూడా ఐటి రిటర్న్స్ స్క్రూటినీ జరగలేదు. మేం నిజాయితీగా ఉన్నాం' అని పేర్కొన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి మా నాయకుడిని దీర్ఘకాలం జైల్లోనే బంధించి ఉంచాలని చూస్తే ఊరుకోబోమని, న్యాయపోరాటం కొనసాగిస్తామని చెప్పారు. 17ఎపై రెండు వారాల్లో జడ్జిమెంట్ రానుందని, అందుకోసం వేచి చూస్తున్నామని తెలిపారు.



సెంట్రల్ జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న లోకేష్

గ్రీన్‌ఛానల్ ద్వారా తిరుపతికి గుండె తరలింపు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ (విజయవాడ)

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి గుండెను గ్రీన్ ఛానల్ ద్వారా తిరుపతికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కృష్ణా జిల్లా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి చెందిన 23 సంవత్సరాల యువకుడు ఆరుగురు జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ నెల 25 రాత్రి తొమ్మిది గంటల సమయంలో నిడుమోలు గ్రామంలో పని ముగించుకుని తన ఊరు వెళ్లడానికి మచిలీపట్నం- విజయవాడ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమవ్వడంతో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆయుష్ ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్‌డెడ్ అయినట్లుగా వైద్యులు గుర్తించారు. అవయవదానానికి యువకుడి కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో గుండెను తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రికి, లివర్, ఒక కిడ్నీని గుంటూరులోని మణిపాల్ హాస్పటల్‌కు, ఒక కిడ్నీని విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రికి, కళ్లను విజయవాడలోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించాలని నిర్ణయించారు. గ్రీన్‌ఛానల్ ద్వారా గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతిలోని పద్మావతి ఆసుపత్రికి గుండెను తరలించారు.

త్వరలో ఫార్మసీ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అతి త్వరలో విడుదల చేస్తామని సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి వెల్లడించారు.

ఫార్మసీ కళాశాలల అనుమతి పొడిగింపునకు ప్రభుత్వం అంగీకరించిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి అభ్యర్థులకు తొలుత ఐదు రోజులు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీరికి సీట్ల కేటాయింపు జరిగిన వెంటనే బైపిసి విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఫార్మ-బి, ఫార్మ-డి కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలతో సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి పోటీ

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ)

రానున్న ఎన్నికల్లో విశాఖ లోక్‌సభస్థానం నుంచిపోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కెఎ.పాల్ తెలిపారు. విశాఖ ఆశీలుమెట్టలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో నవంబర్ 9న ఉదయం 10 గంటలకు బిసి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, ఉభయగోదావరి జిల్లాల బిసి సంఘాలు పాల్గొంటాయని చెప్పారు. అగ్రవర్ణాల నేతలే ముఖ్యమంత్రులు అవుతున్నారని, ఇది మారాలని అన్నారు. 'పాల్ అన్న రావాలి - పాలన మారాలి' అనే నినాదంతో ఎన్నికల్లో పోటీ చేస్తాని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కోటి మంది నిరుద్యోగులు ఉన్నారని, వీరికి ప్రజాశాంతి ప్రభుత్వం వచ్చాక ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, బిసి నాయకులు ఎస్ఎ.రమణ, ఎస్‌సి.అప్పారావు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ఉంటాం

- టిటిడిపి అధ్యక్షులు కాసాని
- బిజెపితో పొత్తు నాదృష్టిలో లేదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. బిజెపితో పొత్తు నాదృష్టిలో లేదనీ, ఒంటరిగానే ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌తో చర్చించాకే ఎన్ని స్థానాల్లో పోటీచేయాలనేది నిర్ణయిస్తామని వివరించారు. శనివారం చంద్రబాబును పరామర్శించేందుకుగాను రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లారు. ములాఖాత్‌లో భాగంగా ఆయన బాబును కలిశారు. తెలంగాణ రాజకీయాలు, ప్రస్తుత పరిస్థితులు, పొత్తులు, ఇతర అంశాలపై బాబుతో చర్చించారు. పోటీ చేసేందుకు చంద్రబాబు సైతం అంగీకరించినట్టు కాసాని చెప్పారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి ? ఎక్కడెక్కడ చేయాలి ? తదితర అంశాలకు సంబంధించి లోకేశ్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు, కాసానికి సూచించారు. ఈనేపథ్యంలో ములాఖాత్ అనంతరం కాసాని జ్ఞానేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలోని అన్నీ స్థానాల్లో పోటీచేయాలని భావిస్తున్నామన్నారు. తెలంగాణలో టిడిపి బలంగానే ఉందన్నారు. ఆదివారం లోకేశ్‌తో పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాత పోటీ చేసే స్థానాలు, సంఖ్య ఖరారవుతుందని తెలియజేశారు.





ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నెల్లూరులో ...

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-యంత్రాంగం

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ సిబ్బందికి రిస్కు హెల్స్ అలవెన్సులు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, క్లాప్ డ్రైవర్‌లకు రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం ఆందోళనలకు దిగారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. గత ఎన్నికల ముందు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ వద్ద పెద్దఎత్తున ధర్నా, అక్కడి నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కర్నూలు, నంద్యాల జిలాల్లో ధర్నా నిర్వహించారు. నందికొట్కూరులో మున్సిపల్ కార్యాలయం, గూడూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో కార్మికులు పని విరామ సమయంలో నిరసన తెలిపారు.

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో బంగ్లా సెంటర్ నుండి సినిమా హాల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇచ్చారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతపురం, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ధర్నాలు చేశారు.

'ఇఎపిసెట్' మూడో విడత కౌన్సెలింగ్

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్) మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి రెండు విడతల కౌన్సెలింగ్ మాత్రమే నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీలు, ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 1,21,306 సీట్లు ఉన్నాయని, వీటిలో 94,580 మాత్రమే భర్తీ అయ్యాయని వివరించారు. ఇంకా 2,67,726 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మూడో విడత నిర్వహించకుండా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సీట్లకు అర్హులైన అభ్యర్థులున్నా మూడో విడత ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. గతేడాది 20 వేల సీట్లు ఖాళీగా ఉంటే ప్రత్యేక కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రం నాలుగు విడతలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను తగ్గిస్తుందన్నారు. వెంటనే మూడో విడత నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మేడిగడ్డలో మరికొన్ని పియర్స్‌కు పగుళ్లు

- నేటిలోగా వివరాలన్నీ ఇవ్వాలన్న ఎన్‌డిఎస్‌ఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలో 20వ పియర్‌కు సమీపంలోని అయిదారు పియర్స్‌కు స్వల్పంగా పగుళ్లు ఏర్పడ్డాయి. బ్యారేజీ కుంగుబాటు అనంతరం ఇరిగేషన్ ఇంజనీర్లు, ఎల్అండ్‌టి కంపెనీ సిబ్బంది గత మూడు రోజులుగా డ్యామ్ మొత్తం క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కువగా దెబ్బతిన్న 20వ పియర్ సమీపంలో వరుసగా అయిదారు పియర్‌లలో అధికారులు పగుళ్ల గుర్తించారు. వెంటనే సమాచారాన్ని ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మొదట బ్యారేజీ ఎగువన కాఫర్ డ్యామ్ నిర్మాణం, నీటిని తోడిపోయడం, పునాది వరకు పరిశీలన, బ్యారేజీలో ఎగువ, దిగువ కట్ ఆఫ్ వాల్స్ పరిస్థితిపై అధ్యయనం చేయాలని ఇరిగేషన్ స్పెషల్ సిఎస్ రజత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కుంగుబాటు ఒక్క బ్లాకుకే పరిమితమైందా? ఇతర బ్లాకుల పరిస్థితి ఏమిటన్నది కూడా అధ్యయనం చేస్తామన్నారు. దీనికోసం అధికారులు ఒక షెడ్యూల్‌ను రూపొందించినట్లు తెలిసింది. మేడిగడ్డ బ్యారేజ్ ఘటన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం మరో లేఖ రాసింది. బ్యారేజీ కుంగుబాటుపై తాము కోరిన సమాచారం వెంటనే ఇవ్వాలని జాతీయ డ్యామ్ భద్రత అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ)పేర్కొంది. తాము 20 అంశాలపై సమాచారం కోరగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం మూడింటికే వివరాలు ఇచ్చిందనీ, ఆదివారంలోగా మొత్తం సమాచారం ఇవ్వాలని సిఎస్‌కు రాసిన లేఖలో ఎన్‌డిఎస్‌ఎ స్పష్టం చేసింది.



విశాఖ సభలో మాట్లాడుతున్న మంత్రి సిదిరి అప్పలరాజు

బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం

- కొనసాగిన వైసిపి బస్సు యాత్రలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు రాజ్యాధికారం కల్పించి వారికి అగ్రపీఠం వేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు వైసిపి నాయకులు తెలిపారు. మహిళలకు సముచిత స్థానం కల్పించి ఆర్థిక భరోసానిచ్చామన్నారు. వైసిపి చేపట్టిన బస్సు యాత్రలు మూడో రోజూ కడప, బాపట్ల, విశాఖపట్నంలో కొనసాగాయి

కడప జిల్లా ప్రొద్దుటూరు స్థానిక శివాలయం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 14ఏళ్ల పాలనలో చేసిందేమీలేదని విమర్శించారు. రాజ్యసభ ఎంపి బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. బిసిలకు రూ.లక్షా62వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించామని తెలిపారు. కర్నూలు మాజీ ఎంపి బుట్టా రేణుక మాట్లాడుతూ.. మహిళలకు సముచిత స్థానం కల్పించి ఆర్థిక భరోసానిచ్చిన పార్టీ వైసిపి అని అన్నారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. చేసిన తప్పుకు తండ్రి జైల్లో ఉంటే తనయుడు లోకేష్ ఐదు రోజులు రాష్ట్రంలో లేరని, జైల్లో వేస్తారనే భయంతో ఢిల్లీకి పారిపోయారని విమర్శించారు. ఎవరైనా తాను ముఖ్యమంత్రి కావాలని పార్టీ పెడతారని, దత్త పుత్రుడు మాత్రం చంద్రబాబు సిఎం కావాలని పార్టీ నడుపుతున్నాడని ఎద్దేవా చేశారు.

విశాఖ తగరపువలస సమీపంలోని చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ..లోకేష్, భువనేశ్వరి సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయన్నారు. తాను నిప్పంటూ ఇన్నాళ్లూ చెప్పుకున్న చంద్రబాబు..స్కీమ్‌ల పేరిట స్కాములు చేసి రాజమండ్రి జైలు ఉన్నారన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ..రాష్ట్రంలో 136 వెనుకబడిన తరగతులను గుర్తించి 36 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి, పాలక వర్గాలను నియమించామని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. దళితుల సంక్షేమానికి సిఎం పెద్దపీట వేస్తున్నారన్నారు. రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని తెలిపారు. బాపట్లలో జరిగిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ..ఎవరెన్ని పిల్లి మొగ్గలు వేసినా, ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా మళ్లీ గెలిచేది వైసిపినే అని అన్నారు. ఎంపి నందిగాం సురేష్ మాట్లాడుతూ.. అమరావతి పేరుతో చంద్రబాబు కుంభకోణం చేస్తే.. పేదల కోసం జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు.

రూ.377.68 కోట్లకు చేరిన ఎన్నికల సొత్తు స్వాధీనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, నిబంధనావళి అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి 28వ తేదీ వరకు ఎన్నికల సంఘం నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన సొమ్ము విలువ రూ.377.68 కోట్లకు చేరింది.

ఈ నెల 27 ఉదయం 9 నుంచి 28వ తేదీ ఉదయం 9 గంటల వరకు జరిపిన తనిఖీల్లో రూ.5.32 కోట్ల నగదు, రూ.6.11 కోట్ల విలువైన మద్యం, రూ.58.27 లక్షలు విలువైన 83.816 కిలోల గంజాయి, 43.75 కిలోల ఎన్‌డిపిఎస్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.19.13 లక్షలు విలువైన బంగారం, వెండితోపాటు రూ.1.65 కోట్లు విలువైన ల్యాప్‌టాప్‌లు, వాహనాలు, కుక్కర్లు, చీరలు, మొబైల్ ఫోన్లు, క్రీడా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తెలిపింది.



పోరాట యోధుడికి ఘన నివాళులు

- ఐటిడిఎ ఆధ్వర్యాన కొమురం భీం వర్ధంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జల్ జంగల్.. జమీన్ కోసం పోరాటం చేసిన యోధుడు కొమురం భీంకు ఘన నివాళులు అర్పించారు. భీం 83వ వర్ధంతి సందర్భంగా కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో శనివారం ఆయన మనుమడు సోనేరావు అధ్యక్షతన ఉట్నూర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలతో ఉదయం 8 గంటలకు జెండా ఆవిష్కరించి కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీం చరిత్ర ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు మాత్రమే వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజాదర్బార్ నిర్వహించలేదు. వేడుకల్లో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటిడిఎ పిఓ చాహత్ బాజ్‌పాయ్, ఎస్‌పి సురేష్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రీవాల్, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, పలువురు నాయకులు, అధికారులు, ఆదివాసులు పాల్గొన్నారు.

బిసి సిఎం జపం ఎన్నికల గిమ్మిక్కే

- చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి బిసి సిఎం జపం ఎన్నికల గిమ్మిక్కేనని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎక్స్ (ట్విట్టర్)లో "ఆస్క్ కవిత" కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు కల్వకుంట్ల కవిత సమాధానాలిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న బిసిని తప్పించి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేంద్రంలో బిసి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసేందుకు నిరాకరించి, బిసిల కులగణన చేపట్టడాన్ని విస్మరించి, మహిళా కోటాలో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించేందుకు నిరాకరించిన బిజెపి.. బిసి జపం ఎన్నికల కోసమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందనీ, వంద స్థానాల్లో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అరెస్టు కావడం దురదృష్టకరమని, ఆయన కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న బాధను తాను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు.

బిజెపి చేతిలో కీలుబొమ్మలా రాష్ట్ర ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మ గౌరవాన్ని కాపాడతారా? బిజెపి ముందు మోకరిల్లుతారా? అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బిజెపికి తెలిసే చంద్రబాబు అరెస్టు జరిగిందని టిడిపి కిందిస్థాయి నాయకులు నమ్ముతున్నారన్నారు. చంద్రబాబును అరెస్టు చేసే విధానాన్ని ఖండించామని, అరెస్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం నాటకం ఆడుతోందని విమర్శించారు. బిజెపి వల్ల ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయని, బిజెపిని ఆదర్శంగా తీసుకుని వైసిపి హక్కులను హరిస్తుందని అన్నారు. జాతీయస్థాయిలో ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగే పోరాటంలో టిడిపి పాల్గొనాలన్నారు. వైసిపి సామాజిక న్యాయం పాటించడం లేదని, దళితులపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదని అన్నారు.

అంతా బాగుబాగు

- ఇండికేటర్లు సిద్ధం చేసిన ప్రణాళికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎప్పుడూ ఉన్నది లేనట్టుగా... లేనిది ఉన్నట్టుగా చూపించే ప్రణాళికశాఖ ఆస్పిరేషనల్ జిల్లాల అభివృద్ధిపై ఇండికేటర్ల అంశంలోనూ భారీ నివేదికలే సిద్ధంచేసింది. అన్ని రంగాలూ బాగుబాగు అంటూ ప్రకటించేసింది. ఇది ప్రభుత్వానికి సంతోషం కలిగించేదే అయినప్పటికీ, అందులోని వాస్తవాల శాతం ఎంతన్నదానిపై అధికారుల్లోనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని ఏస్పిరేషనల్ జిల్లాలకు సంబంధించి మొత్తం 120 రంగాల్లో ఇండికేటర్లను ప్రకటించగా, అందులో ఏకంగా 111 రంగాల్లో 'పాజిటివ్'గా ఉన్నట్లు తేల్చింది. కేంద్రం ఆధ్వర్యంలో 2018లో ఆస్పిరేషనల్ జిల్లాల (వెనుకబాటు నుంచి పురోగతి సాధిస్తున్న) కార్యక్రమంలో రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, కడప జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో అమలవుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య-న్యూట్రిషన్, విద్య, వ్యవసాయం, జల వనరులు, ఆర్థిక పరిస్థితి, వృత్తి నైపుణ్యం, కనీస మౌలిక సౌకర్యాల రంగాల్లో అభివృద్ధిపై ప్రణాళిక శాఖ ఇండికేటర్లను తయారుచేసింది. ఈ రంగాలకు సంబంధించి 120 అంశాలపై నివేదికలు సిద్ధంచేసింది. ఆరోగ్యశాఖకు సంబంధించి ఆస్పత్రులకు వస్తున్న గర్భిణుల సంఖ్య, ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు వైద్యం, కాన్పులు, వారికి ఎనీమియా, హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణ, వారికి ఇస్తున్న పౌష్టికాహారం వంటి అంశాల్లో పాజిటివ్ సర్టిఫికెట్‌ను ప్రణాళిక శాఖ అందించింది. పుట్టిన పిల్లల ఆరోగ్యంపైనా ఇదే తరహా నివేదికలు సమర్పించింది. మహిళా సంక్షేమం, పాఠశాల విద్యలోనూ అంతా భేషుగ్గా ఉందని ఇండికేటర్స్ నివేదికలో పేర్కొనడం గమనార్హం. విద్యా రంగంలో 3, 5, 8 తరగతుల్లో గణాంకం, విభాగాల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలు కూడా బాగున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖలో విత్తనాల పంపిణీ, అనేక మండలాలను ఎలక్ట్రానిక్ మార్కెట్లను అనుసంధానం చేయడం, పంట బీమా చెల్లింపులు కూడా అద్భుతంగా ఉన్నట్లు ఇండికేటర్లలో పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో నీటి వనరులను పునరుద్ధరించినట్లు తెలిపారు.

బాగోలేని కొద్ది రంగాలు ఇవే

ఆరేళ్లలోపు తక్కువ బరువున్న పిల్లల విభాగంలో తిరోగమనం కనిపించినట్లు ఇండికేటర్ల విభాగంలో పేర్కొన్నారు. పుట్టుక సమయంలో 2.5 కిలోల కన్నా బరువు తక్కువ ఉన్న విభాగంలో, వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేకుండా అనేక వ్యాధులకు గురవుతున్న వారు, తీవ్ర పౌష్టికాహార లోపం ఉన్న వారి విభాగంలో, ఆరేళ్లలోపు వారికి పోషకాహార లభ్యత వంటి రంగాల్లో ఇండికేటర్లు నెగిటివ్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఎస్ఐ మృతి

ప్రజాశక్తి-బాపట్ల

అనుమానాస్పద స్థితిలో ఎఎస్ఐ మృతి చెందిన ఘటన బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల పరిధిలోని సంగుపాలెంకోడూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ మహిళ ఇంటి ముందు శనివారం తెల్లవారు జామున ఓ వ్యక్తి మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడం వారు ఘటనాస్థలికి చేరుకుని ఆరా తీశారు. మృతుడు కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎఎస్ఐ మరియదాసుగా గుర్తించారు. ఆయన గతంలో చందోలు పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేశారు. ఇటీవల కొరిశపాడుకు బదిలీ అయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి డ్రైవర్లపై దాడుల పట్ల ఉదాసీనత విచారకరం : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి డ్రైవర్లపై సంఘ విద్రోహ శక్తులు చేస్తున్న దాడుల పట్ల ఆర్‌టిసి మేనేజ్‌మెంట్ ఉదాసీనంగా వ్యవహరించడం విచారకరమని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తప్పతాగిన ఆకతాయిలు రాజకీయ అండతో భౌతిక దాడులకు దిగుతున్నారని, దాడుల గురించి సోషల్ మీడియా, పత్రికల్లో వార్తలు వచ్చినా యాజమాన్యం తగిన విధంగా స్పందించడం లేదని అన్నారు. దాడులకు నిరసనగా ఆర్‌టిసి సిబ్బంది, సంఘాలు నిర్వహించే నిరసన కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఉపాధిని సృష్టించేలా పాలిటెక్నిక్ విద్య

- నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ విద్య ఉపాధి సృష్టించేలా రూపాంతరం చెందాలని నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఆధ్వర్యంలో 'ప్రపంచవ్యాప్త పోటీతత్వం దిశగా పాలిటెక్నిక్ విద్యావిధానం మార్పు' అనే అంశంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో విజయవాడలో శనివారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. నేటి సమాజానికి పాలిటెక్నిక్ విద్య ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రతి విద్యార్థీ తన జీవితాన్ని అద్భుతంగా మలచుకునేందుకు ఆన్‌లైన్ అప్‌డేటెడ్ కోర్సులు నేర్చుకోవాలని, స్వతంత్ర పారిశ్రామిక వేత్తలుగా విద్యార్థులు ఎదగాలని కోరారు. ప్రతి విద్యార్థితో పాలిటెక్నిక్ చివరి ఏడాదిలో ఒక వ్యాసం రాయగలిగే స్థాయిలో తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలో మానవ వనరుల కొరత లేదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కమిషనరు సిహెచ్ నాగరాణి మాట్లాడుతూ.. ప్రపంచ పారిశ్రామిక రంగంలో పాలిటెక్నిక్ విద్యార్థులు అత్యుత్తమ ఉద్యోగులుగా నిలిచేలా జాతీయ విద్యావిధానం-2020 రూపుదిద్దుకుందని చెప్పారు. నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేంవర్క్ (ఎన్ఎస్‌క్యూఎఫ్) మార్గదర్శకాలకు అనుగుణంగా యాడ్ అన్‌కోర్సులను రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో శాస్త్రీయ డాక్యుమెంటేషన్, రికార్డు ప్రక్రియలతో 'అకడమిక్ ఆడిట్'ను పున:ప్రారంభిస్తామన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉపాధి చూపించే జాబ్‌మేళాలు, క్యాంపస్ డ్రైవ్‌లలో ఎంపిక వంటి అంశాలను జాయింట్ డైరెక్టర్ ఎంఎవి రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశిక్షణ సంస్థ కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శి జివివిఎస్ మూర్తి, సాంకేతిక విద్య అదనపు సంచాలకులు వి పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేనతో ఉమ్మడి కార్యక్రమాలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా టిడిపి, జనసేన పార్టీలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాల వారీ రెండు పార్టీల సమన్వయకర్తలతో సమావేశాలు జరగనున్నాయని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశాల్లో గ్రామస్థాయిలో ప్రజాసమస్యలు, ఉద్యోగ ఉపాధిలో రాష్ట్ర యువతకు జగన్ చేసిన ద్రోహం, కరువు పరిస్థితులు, సంక్షేమం పేరుతో చేస్తున్న ద్రోహం వంటి వాటి గురించి గడప గడపకూ వివరించేలా కార్యాచరణ చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఇరు పార్టీల నేతల అభిప్రాయాలు, సలహాలు, సూచనలతోపాటు భవిష్యత్ కార్యక్రమాల గురించి కూడా ఉమ్మడిగా చర్చించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ మూడు రోజుల్లో ఆయా జిల్లాల వారీ సమన్వయ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

'కళ్లు తెరిపిద్దాం' పేరుతో నేడు టిడిపి నిరసన

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోన్న జగనాసురుడికి కళ్లు తెరిపిద్దాం పేరుతో ఆదివారం రాత్రి 7 గంటలకు ఐదు నిమిషాల పాటు కళ్లకు గంతలు కట్టుకోవాలని నిరసన తెలపాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇంటివద్దే బాల్కనీ, వీధులు, వాకిళ్లలోకి వచ్చి చంద్రబాబుకు మద్దతుగా 'నిజం గెలవాలి' అని గట్టిగా నినదించాలని కోరారు.

అపహాస్యంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ : అశోక్ బాబు

పారదర్శకంగా, పకడ్బందీగా జరగాల్సిన రిజిస్ట్రేషన్ల ప్రకియను ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి అప్పగించి అపహాస్యంగా మార్చి ప్రజల్ని ఇబ్బంది పెడుతోందని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు అన్నారు. ముస్ముందు ఎంఆర్ఓ అధికారాల్ని కూడా వారికే ప్రభుత్వం అప్పగిస్తుందేమోనని సందేహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రిజిస్ట్రేషన్ విధానంపై ప్రజలకు అనేక సందేహాలున్నాయని తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు, అమ్మకందారులతో పనిలేకుండా, వారు ప్రత్యక్షంగా అందుబాటులో లేకున్నా పంచాయతీ కార్యదర్శులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేస్తున్నారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ తంతు పూర్తయ్యాక ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను కొనుగోలుదారులకు ఎందుకు ఇవ్వడం లేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

వరిపై రుతుపవనాల ఎఫెక్ట్

- ఉత్పత్తి 3.7 శాతం తగ్గే అవకాశం
- 2023-24 ఏడాదికి ఉత్పత్తి అంచనా 1063.13 ఎల్ఎంటి
- గతేడాది 1105.12 ఎల్ఎంటి
- కేంద్రం గణాంకాలు

న్యూఢిల్లీ : భారత్‌లో రుతుపవనాల ప్రభావం వరి ఉత్పత్తిపై పడనున్నది. ఫలితంగా వరి దిగుబడి తగ్గే అవకాశం కనిపిస్తున్నది. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ 2023-24 కు సంబంధించి విడుదల చేసిన ప్రధాన ఖరీఫ్ పంటల మొదటి ముందస్తు అంచనాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

దీని ప్రకారం భారత వరి ఉత్పత్తి 1,063.13 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) వద్ద ఉన్నది. గత సంవత్సరం ఇదే సీజన్‌లో 1,105.12 ఎల్ఎంటీలతో పోలిస్తే 3.7 శాతం తగ్గుదల కావటం గమనార్హం. 2023-24లో అంచనా వేయబడిన ఉత్పత్తి.. 2021-2022లో నమోదైన 1,110.01 ఎల్ఎంటీ కంటే తక్కువగా ఉండటం గమనార్హం. 2023-24 వరి ఉత్పత్తిలో అంచనా తగ్గుదల రుతుపవన వర్షాల అసమానత ప్రభావాన్ని చూపుతుందని వ్యవసాయ, పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో వరి విస్తీర్ణం పెరిగినప్పటికీ దాని ఉత్పత్తి తగ్గుముఖం పడుతుండటం గమనార్హం. వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకారం.. 2023 ఖరీఫ్ సీజన్‌లో వరి ఉత్పత్తి విస్తీర్ణం 411 లక్షల హెక్టార్లు. ఇది 2022లో అదే సీజన్‌లో విస్తీర్ణం 404.27 లక్షల హెక్టార్ల కంటే ఎక్కువ కావటం గమనించాల్సిన విషయం.

"పంటల ఉత్పత్తి అంచనా రాష్ట్రాలు అందించిన డేటాపై ఆధారపడి ఉంటుంది. తర్వాత వివిధ ప్రత్యామ్నాయ వనరుల నుంచి సమాచారాన్ని ఉపయోగించి ధృవీకరించబడుతుంది. 2023-24 (ఖరీఫ్) కోసం ఈ మొదటి ఉత్పత్తి అంచనా ఎక్కువగా గత 3 సంవత్సరాల సగటు దిగుబడిపై ఆధారపడి ఉంటుంది. వాస్తవ పంట కోత ఆధారంగా దిగుబడి అంచనాలను స్వీకరించిన తర్వాత అది మార్పుకు లోనవుతుందని గమనించడం ముఖ్యం" అని వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. "ఖరీఫ్‌లో ప్రధాన పంట అయిన వరి సాగు విస్తీర్ణం గతేడాది చివరి అంచనా కంటే సుమారు 2 లక్షల హెక్టార్లు, సగటు వరి విస్తీర్ణం కంటే 4.5 లక్షల హెక్టార్లు ఎక్కువగా ఉంటుందని అంచనా. సగటు ఖరీఫ్ బియ్యం ఉత్పత్తితో పోలిస్తే దీని ఉత్పత్తి దాదాపు 1 లక్ష టన్నులు ఎక్కువగా ఉంటుందని అంచనా. "2023-24కి ఖరీఫ్ ముతక తృణధాన్యాల ఉత్పత్తి 351.37 ఎల్ఎంటీగా అంచనా వేయబడింది, ఇది సగటు ముతక తణధాన్యాల ఉత్పత్తి 350.91 ఎల్ఎంటీ కంటే కొంచెం ఎక్కువ. పప్పు ఉత్పత్తి 34.21 ఎల్ఎంటీగా అంచనా వేయబడింది. ఇది గతేడాది ఉత్పత్తిని పోలి ఉంటుంది" అని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటన పేర్కొనటం గమనార్హం.

సెంట్రల్ పూల్‌లో ఆహారధాన్యాల నిల్వలు క్షీణించడం, పెరిగిన తృణధాన్యాల ధరలు, ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలకు కొనసాగుతున్న రుతుపవనాల అసమాన ముప్పు వంటి కారణాలతో ఈ ఏడాదిజులైలో బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతిని భారత్ నిషేధించింది. భారత్ ఇంతకుముందు 2022 మే 13 నుంచి గోధుమల ఎగుమతిని నిషేధించింది. 2022 సెప్టెంబర్ 8న పారాబాయిల్డ్ రైస్ మినహా అన్ని బాస్మతీయేతర బియ్యంపై 20 శాతం ఎగుమతి సుంకం విధించబడింది. 2022, సెప్టెంబర్ 9న విరిగిన బియ్యం ఎగుమతిపై నిషేధం విధించబడిన విషయం విదితమే.

ప్రజాశక్తి
www.prajasakti.com

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం కూర్మన్నపాలెంలోని జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. దువ్వాడ ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం... గాజువాక పరిధిలోని సింహగిరి కాలనీకి చెందిన గుజ్జు వెంకటరమణారెడ్డి (33), ఆయన భార్య వరలక్ష్మీదేవి (29) అనకాపల్లిలోని నూకాలమ్మ గుడికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. దర్శనం అనంతరం గాజువాకకు తిరుగు ప్రయాణం అయ్యారు.

కూర్మన్నపాలెంలోని ట్రాఫిక్ సిగ్నల్ దాటిన తరువాత ఆటోను తప్పించబోయి ద్విచక్ర వాహనంతో సహా పక్కకు పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ వారిద్దరిపై నుంచి వెళ్లిపోయింది. లారీ చక్రాల కింద నలిగి భార్యాభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ట్రాఫిక్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సిఎం పొలం బాట పట్టాలి

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి దుర్భరంగా మారిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ వదిలి పొలం బాట పట్టాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కొన్ని ప్రాంతాలు ఎడారిని తలపిస్తున్నాయన్నారు. ఆలూరు ప్రాంతంలో 20 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎకరాకు రూ.లక్ష పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 లక్షల ఎకరాల్లో ఇంతవరకు సాగు జరగలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సిఎం ప్రజల్లోకి రావాలని, వారిని కలుసుకుని కష్టసుఖాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

వైద్య రంగంలో దోపిడీ

- అరికట్టేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి
- ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్



శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖ)

వైద్య రంగంలో దోపిడీ ధోరణులకు స్వస్తి పలకాలని, అందుకోసం అంతర్గత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ కోరారు. వైద్య వృత్తి ధర్మబద్ధమైనదని, మానవాళికి చేసే సేవగా అభివర్ణించారు. వ్యాపారీకరణ పద్ధతిగా ఎదిగిన కొన్ని సంస్థలు దీనికి భిన్నంగా ముందుకు వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి వైద్యం అందించిన వైద్యుల అంకితభావాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. విశాఖపట్నం బీచ్‌రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రజలు ఆస్పత్రికి చేరుకోకుండా ఒక యంత్రాంగాన్ని రూపొందించడం ద్వారా సంపూర్ణ వైద్య సంరక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. అన్ని రకాల ఔషధ చికిత్సలతో పాటు, అల్లోపతి వంటి వాటిని మర్చిపోకూడదని పేర్కొన్నారు. 2014లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పడటం సంతోషించదగ్గ విషయమన్నారు. అన్ని రకాల ఔషధ చికిత్సల కలయిక ద్వారా సంపూర్ణ వైద్య సంరక్షణకు కృషిచేయాలని కోరారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ సెంటినరీ అకడమిక్ బ్లాక్ బిల్డింగ్‌కు రూ.50 కోట్లు సహకారం అందించిన పూర్వ విద్యార్థులను ప్రశంసించారు. ముందుగా ఆంధ్ర మెడికల్ కాలేజీలో క్లినికల్, బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. 1923లో స్థాపించబడిన దేశంలోని ఏడవ పురాతన వైద్య కళాశాల ఆంధ్ర మెడికల్ కళాశాల అని అన్నారు. ప్రస్తుతం దాదాపు 2000 మంది విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులను అభ్యసిస్తున్నారని తెలిపారు. అనంతరం తూర్పు నౌకదళ కమాండ్‌ను ఉపరాష్ట్రపతి, గవర్నర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ సెంటినరీ కమిటీ ఛైర్మన్ డాక్టర్ టి.రవిరాజు, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, సిఎం.రమేష్, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విరమించుకోవాలి

- కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు



సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి, ప్లాంట్‌ను పరిరక్షించాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. అనకాపల్లిలోని దొడ్డి రామునాయుడు భవనంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, పిడిఎస్ఒ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ.. ఆంధ్రుల పోరాటం ఉలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం వచ్చిందన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిందని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వానికి రూ.50 వేల కోట్లను పన్నుల రూపంలో చెల్లించిందన్నారు. రూ.మూడున్నర లక్షల కోట్ల విలువైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బిజెపి ప్రభుత్వం రూ.30 వేల కోట్లకు తన అనుయాయులకు అమ్మేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమగా ఉండి, వేలాది మందికి ఉపాధి కల్పిస్తోన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తానని కేంద్ర ప్రభుత్వం చెబుతుంటే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు నోరెత్తడంలేదన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులందరూ నవంబర్ 8వ తేదీన జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రమణ, ఎస్.నాగరమణ, సహాయ కార్యదర్శి గీతాకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.శివాజీ, ఎస్‌వి నాయుడు, సహాయ కార్యదర్శి బి.శివ, జిల్లా కమిటీ సభ్యులు జి.సురేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్రకుమార్, ఎఐవైఎఫ్ నాయకులు వి.రాజు, పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి భాస్కర్ తదితరులు మాట్లాడారు.



రోడ్డుపై గుంతలు పూడుస్తున్న మహిళలు

మహిళల్లో చైతన్యం

- సొంతంగా రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం (తూర్పుగోదావరి జిల్లా)

అదో మారుమూల గ్రామం. సరైన రహదారి సౌకర్యంలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా అధికారులు స్పందించలేదు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో మహిళలే నడుము బిగించారు. తమ రోడ్డుకు తామే స్వయంగా మరమ్మతులు చేసుకున్నారు. పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని రుజువు చేసి చూపించారు. ఈ సంఘటన తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో శనివారం చోటు చేసుకుం ది. మోర్త - పెరవలి ఆర్అండ్‌బి రహదారిలోని తాడిపర్రు ఒకటో వార్డులో రోడ్డుకు పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ఈ గుంతల్లో పడి అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఏడాది కాలంగా స్థానిక ప్రజలు కోరుతూనే ఉన్నారు. రోడ్డు మరమ్మతు కోసం రూ.40 వేలు మంజూరు అయ్యాయని, నిధులు లేకపోవడంతో పనులు ప్రారంభించడం లేదని సంబంధిత శాఖ ఎఇ చెప్పారు. దీంతో ఒకటో వార్డుకు చెందిన మహిళలు అక్కిన రత్నం, అక్కిన పద్మ, అక్కిన సత్యవతి, అక్కిన పద్మావతి, అక్కిన విశాల, అక్కిన చిన్నమ్మ, జజ్జవరపు సీతారత్నం, పండితారాధ్యుల వీరభద్ర గిరిజ, పొట్లచెరువు పద్మావతి, తదితర మహిళలు వ్యక్తిగతంగా వారే డబ్బులు వేసుకుని గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలకు నిధులను వెచ్చిస్తున్నా.. రహదారులకు అవసరమైన నిధులను కేటాయించక పోవడం బాధాకరమని అన్నారు.

పట్టుదలతోనే విజయం

- ప్రతి అభ్యర్థి సిలబస్‌పై పట్టు సాధించాలి
- గ్రూప్ పరీక్షలపై అవగాహనా సదస్సులో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిసిఎల్ఎ సెక్రటరీ ఎఎండి ఇంతియాజ్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ (ఎన్‌టిఆర్ జిల్లా)

పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే గ్రూప్ పరీక్షల్లో సులభంగా విజయం సాధించవచ్చని పలువురు వక్తలు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని సిద్ధార్థ ఐఎఎస్ అకాడమీలో పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఛారిటబుల్ ట్రస్టు, సిద్ధార్థ ఐఎఎస్ అకాడమి ఆధ్వర్యాన గ్రూప్ -1, గ్రూప్-2 నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ శిక్షణ పొందుతున్న అభ్యర్థుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సిసిఎల్ఎ సెక్రటరీ ఎఎండి ఇంతియాజ్, పౌర సరఫరాల ఎండి జి.వీరపాండియన్, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పాల్గొన్నారు. తొలుత కె.ఎస్.లక్ష్మణరావు రచించిన గ్రూప్-2 'ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ - ఆంధ్రుల సామాజిక ఆర్థిక చరిత్ర' పుస్తకాన్ని ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రూప్ పరీక్షలు రాయదలచుకునే అభ్యర్థులకు తొలుత సిలబస్‌పై పూర్తి స్థాయి అవగాహన ఉండాలన్నారు. గ్రూప్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను తెలుసుకుని, వాటిని సేకరించి ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఎఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే ప్రతి అభ్యర్థి ముందుగా తన లక్ష్యాన్ని నిర్ణయించుకుని, దానికి అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. చరిత్ర అంశాలతోపాటు పాఠశాల స్థాయిలో చదువుకున్న ప్రతి సబ్జెక్టుపై అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటువంటి సదస్సు నిర్వహించడం పట్ల పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. వీర పాండియన్ మాట్లాడుతూ.. మనం చేసే పనిలో కొన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. ప్రతి రోజూ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ విక్రమ్ కుమార్‌రెడ్డి పలు సూచనలు అందించారు. జిఆర్‌కె పోలవరపు సాంస్కృతిక వేదిక అధ్యక్షులు గోళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిద్ధార్థ ఐఎఎస్ అకాడమి డైరెక్టర్ మన్నం రాజారావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి : సిపిఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. శనివారం సిపిఐ రాష్ట్ర సమావేశం దాసరి భవన్లో జరిగింది. జాతీయ కార్యదర్శి నారాయణ, రామకృష్ణ, రావుల వెంకయ్య, వనజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు తీర్మానాలు ఆమోదించారు. తక్షణం కరువు మండలాలు ప్రకటించాలని, నష్టపోయిన పంటల్లో ఆహార పంటలకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వాతావరణ బీమా, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, రైతు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల రుణాలను రద్దు చేయాలని కోరారు. 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కరువు పెన్షన్లు ఇవ్వాలన్నారు. వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళల పెన్షన్లను నెలకు రూ.6 వేలకు పెంచాలని, వికలాంగులకు రూ.7 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు. ఎయిడ్స్, కిడ్నీ, తలసేమియా, పెరాలసిస్, మంచమ్మీద నుండి లేవలేని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ట్రాన్స్‌జెండర్స్ మొదలైన వారందరికీ వయసుతో సంబంధం లేకుండా పెన్షన్లు ఇవ్వాలని తీర్మానించారు.

అప్పుల వాస్తవాలు ప్రజల ముందుంచండి

ఆర్థికశాఖ మంత్రికి యనమల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అప్పుల వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు కోరారు. ఈ మేరకు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి శనివారం లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రజలందరూ నమ్ముతున్నారని అన్నారు. కాగ్ సంస్థ 2021-22 ఆడిట్ నివేదికలో ఇచ్చిన గణాంకాలపై ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శికి ఆగస్టు 23న లేఖ రాశానని వివరించారు. మండలి ప్రతిపక్షనేతగా ఉన్న తనకు ఏ విధమైన సమాధానం రాకపోవడం శోచనీయమన్నారు. 2020-21 నివేదిక ప్రకారం ప్రభుత్వం వచ్చిన మూడేళ్లలో రూ.3.25 లక్షల కోట్లు అప్పు, స్థూల ఉత్పత్తి నిష్పత్తి 40 నుంచి 45 శాతం వరకు ఉండటం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు సిజె

తిరుమల, ప్రజాశక్తి యంత్రాంగం

తిరుమల శ్రీవారిని ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు టిటిడి జెఇఒ వీరబ్రహ్మం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం బహుకరించారు. అనంతరం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయాన్ని జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దర్శించారు. ఈ కార్యక్రమాల్లో డిఎల్ఒ వీర్రాజు, డిప్యూటీ ఇఒలు గోవిందరాజన్, లోకనాథం పాల్గొన్నారు.

పాక్షిక చంద్రగ్రహణంతో మూతపడ్డ ప్రధాన దేవాలయాలు

పాక్షిక చంద్రగ్రహణం కారణంగా రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలు మూతపడ్డాయి. నంద్యాలలోని శ్రీశైలం, విశాఖలోని అప్పన, విజయవాడలోని దుర్గమ్మ, తిరుపతిలోని శ్రీవారి ఆలయాలు మూతపడ్డాయి. శనివారం సాయంత్రం 7.15 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ.. గ్రహణం అర్ధరాత్రి 1.05 నుంచి 2.22 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అందువల్ల గ్రహణ సమయానికి ఏడు గంటల ముందు శ్రీవారి ఆలయం మూసివేయడం జరుగుతుందని తెలిపారు. గ్రహణం పూర్తయ్యాక ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా శ్రీవారి కైంకర్యాలు, యాత్రికుల దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సింహాచలం అప్పన్న దేవాలయంలో ఉదయం 6:30గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు మాత్రమే యాత్రికులను అనుమతించారు. మధ్యాహ్నం 2:30 గంటల తర్వాత దర్శనాన్ని నిలిపివేశారు. ఆదివారం 8:00 గంటల నుంచి స్వామివారి దర్శనం పున:ప్రారంభం కానుంది.

ఆర్‌టిసి సిబ్బందిపై దాడులను ఖండించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి సిబ్బందిపై యాజమాన్యం వేధింపులతోపాటు కొంతమంది సంఘవిద్రోహ శక్తుల దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. యాజమాన్యం కూడా దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ తరపున ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొంతమంది సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడని యాజమాన్యం.. దాడులపై మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కావలిలో ఆర్‌టిసి డ్రైవరుపై జరిగిన దాడి సిబ్బందిని తీవ్ర ఆగ్రహానికి, బాధకు గురిచేసిందని తెలిపారు. దీనిపై ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని, సిబ్బంది గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటనపై సిబ్బంది, సంఘాలు స్పందించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ కోరింది.

ఎపిజెఎసి అమరావతి

కావలిలో ఆర్‌టిసి డ్రైవరుపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని, దీని ద్వారా ఆర్‌టిసి ఉద్యోగుల్లో మనోధైర్యాన్ని నింపాలని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరంతరం రాత్రీ పగలు తేడా లేకుండా ప్రయాణికులకు సేవలు అందిస్తున్న ఉద్యోగులపై దాడికి దిగడం చాలా బాధాకరమని అన్నారు. రోడ్డుకు అడ్డంగా కారు ఆపి సైడ్ ఇవ్వలేదని హారన్ కొట్టినందుకు విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రయాణికులు సర్దిచెప్పినా వినకుండా రెండు కార్లలో వచ్చి ప్రాణహాని కలిగేలా కొట్టిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో నాయకులు ఫణి పేర్రాజు, వివి మురళీకృష్ణనాయుడు ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన : ఎన్ఎంయు

కావలిలో ఆర్‌టిసి డ్రైవరు బత్తుల రాంసింగ్‌పై భౌతిక దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్లలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలపాలని ఎన్ఎంయు కోరింది. విచక్షణ రహితంగా దాడిచేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిజికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వై శ్రీనివాసరావు తెలిపారు.

హారన్ కొట్టడం నేరమని చట్టం చేస్తారేమో : నాదెండ్ల

వైసిపి అధికారంలోకి వచ్చాక అరాచకం అనేమాట తప్ప అభివృద్ధి అనే మాట వినిపించడం లేదని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార దుర్వినియోగం, దానికి అహంకారం తోడై వైసిపిలో ప్రతిస్థాయిలో ఉండే నాయకుడు ఉద్యోగులు, ప్రజలపై దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. హారన్ కొట్టినందుకు ఆర్‌టిసి డ్రైవరుపై దాడిచేసి దారుణంగా కొట్టడం అన్యాయమని అన్నారు. వైసిపి ప్రభుత్వం తమ గూండా నాయకులకు, కార్యకర్తలకు మద్దతుగా కొత్త చట్టాలు చేస్తుందేమోననే సందేహం వ్యక్తం చేశారు.

సంపాదకీయం


గృహిణి @ 24/7

కొవ్వొత్తి తాను కరుగుతూ...తన చుట్టూ వెలుగునిస్తుంది. అచ్చంగా ఆమె కూడా అంతే. తాను కరుగుతూ...కుటుంబమంతటికీ వెలుగవుతుంది. అందుకేనేమో 'ఇల్లాలే ఇంటికి వెలుగు' అన్నారు. అన్నీ తానై చక్కబెడుతుంది. ఇంటిని సరైన దిశలో నడిపేందుకు క్షణం తీరికలేకుండా శ్రమించే చోదకశక్తి ఆమె. ఉదయం లేచింది మొదలు... రాత్రి పడుకునే వరకు విరామమెరుగక నడిచే గానుగ ఆమె. అయినా.. ఆమె ఏ పనీ చేయదు... ఇంట్లోనే వుంటుంది. హౌస్‌వైఫ్ అని పిలుచుకునే ఆమెకు సిసలైన అర్థం గృహిణి. భర్తతో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నా... ఇంటిపని, వంటపని మాత్రం ఆమెదే. భర్తతో సమాన హోదాలో పనిచేస్తున్నా... సమాన వేతనం తీసుకొంటున్నా ఇంటి చాకిరీ ఏమీ తగ్గదు. పిల్లలకు, పెద్దలకు చేసే పనులేవీ శ్రమగా గుర్తింపబడవు. పైగా దానికి బాధ్యత అనే ఒక ట్యాగ్ లైన్ తగిలిస్తారు. మహిళలు కూడా ఇది మా బాధ్యతే అనో, మా తలరాత అనో సరిపెట్టుకు నేలా చిన్నప్పటి నుంచే వారిని ట్యూన్ చేస్తుందీ కుటుంబ వ్యవస్థ.

వండుతూ, వడ్డిస్తూ, తోముతూ, కడుగుతూ, సర్దుతూ... అన్ని రకాల పనులు చేస్తున్నప్పటికీ, వారి శ్రమకు గుర్తింపు ఇవ్వట్లేదు. స్త్రీని ఒక మనిషిగా కాకుండా, ఒక వస్తువుగా భావించే వంటింటి సంస్కృతిలో గృహిణి నిరంతరం శ్రమదోపిడీకి గురౌతూనే వుంది. స్త్రీలు చేసే ఇంటి శ్రమకు ముఖ్యంగా వంటింటి శ్రమకు విలువ, గౌరవం ఏనాడూ లేవు. కుటుంబమంతటికీ అహర్నిశలు వండి వార్చాల్సిందే. 'ఈ వంటింటిని తగలెయ్య/ ఎంత అమానుషమైందీ వంటగది/ మన రక్తం పీల్చేసి, మన ఆశల్నీ, కలల్నీ కాజేసి/ కొద్దికొద్దిగా జీవితాంతం పీక్కుతింటున్న/ రాకాసి గద్ద ఈ వంటిల్లు' అంటారు కవయిత్రి విమల. అంతర్జాతీయ కార్మిక సంస్థ 2019 నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 64 దేశాలలోని మహిళలు రోజువారీగా ఎలాంటి జీతం లేకుండా 1640 కోట్ల గంటలు పనిచేస్తున్నారు. ఈ శ్రమకు వేతనం చెల్లించాల్సి వస్తే... ఎంత పెద్ద మొత్తంలో చెల్లించాలో ఊహించుకోవాల్సిందే. ఒకవేళ ఆమె శ్రమకు వేతనం చెల్లించాల్సి వస్తే... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం–గృహిణుల శ్రమకు అత్యంత కనిష్టంగా వేతనం చెల్లించినా నెలకు రూ.22.7 లక్షల కోట్లు అవుతుందని వెల్లడించింది. అంతేకాదు... 81.2 శాతం మహిళలు ఎటువంటి వేతనం లేని ఇంటి చాకిరిలో నిమగ్నమై వున్నారని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్–2020లో విడుదల చేసిన సర్వే చెబుతోంది. గృహ నిర్వహణ, పిల్లలు, వృద్ధుల సంరక్షణ, ఇతరత్రా పనుల కోసం వారానికి 34.6 గంటల సమయాన్ని వెచ్చిస్తున్నట్లు 'జాతీయ సమయ వినియోగ సర్వే' చెబుతోంది. ఇది పురుషులు వెచ్చించే సమయం కంటే పది రెట్లు ఎక్కువ. ప్రభుత్వ గణాంకాల్లో పేర్కొనని, పురుషాధిక్యత గుర్తించలేని శ్రమ ఇది.

బాల్యం నుంచే అంచెలంచెలుగా వంటింటికి బానిసగా మారుస్తుందీ పితృస్వామిక వ్యవస్థ. భార్యగా, తల్లిగా, కోడలిగా...ఒక గృహిణిగా– ఆమె శ్రమ వెల కట్టలేనిది. ఎలాంటి కృతజ్ఞతకూ నోచుకోని 24/7 ఉద్యోగం ఇది. అయినా ఆమె ఇంటికి మహారాణి. ఆమె చేతితో మాత్రం చిల్లిగవ్వ కూడా వుండదు. 'ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి/ అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా/ మా నాన్న పేరే!' అంటారు కవయిత్రి విమల. తల్లికీ– బిడ్డకీ మధ్య తరాలు మారుతున్నా...పురుషాధిక్య సమాజంలో వారి ఆలోచనా దృక్పథంలో ఎటువంటి మార్పు రావడంలేదన్నది నిత్యం మన కళ్ల ముందు జరుగుతున్న ఇంటింటి కథ. సామాజిక, కౌటుంబిక జీవిత ఇతిహాసపు చీకటి కోణంలోపడి మసిబారిపోయిన మాతృమూర్తుల జీవిత కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం. గృహిణులకు గుర్తింపుగా నవంబర్ 3వ తేదీని 'జాతీయ గృహిణుల దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. వారిని సత్కరించే రోజు ఇది. ఇది ఒక రోజుకు పరిమితం కాకూడదు. ఉద్యోగిని అయినా, గృహిణి అయినా... ఆమె శ్రమలో భాగం పంచుకున్న రోజే నిజమైన సత్కారం. ఇంటా బయటా స్త్రీ పురుషులిద్దరూ సమానమేనన్న చైతన్యం ఈ గృహిణుల దినోత్సవం కలిగించాలి.

మహనీయుని మాట




పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడే కొద్దీ ఆర్థిక సంక్షోభాలేర్పడతాయి. నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతుంది.

- కారల్ మార్క్స్


Karl Marx

కేంద్రీకృత వ్యూహంతో బిజెపి త్రిముఖ దాడి

ప్రస్తుతం



అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వీస్తున్న ఎదురు గాలిని తట్టుకోవడానికి బిజెపి అగ్ర నాయకత్వం, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా వేస్తున్న ఎత్తులు పైఎత్తులు అభాసుపాలవుతున్నాయి. ఆర్భాటంగా ప్రకటించిన తతంగాలు చాప చుట్టుకోవలసి వస్తున్నది. ప్రతిపక్షాల నుంచే గాక రాజ్యాంగ నిపుణుల నుంచి, మీడియా నుంచి విమర్శలు రావడంతో అనివార్యంగా వెనక్కు తగ్గవలసి వస్తున్నది. జమిలి ఎన్నికల నినాదం ఆ ఎత్తుగడలకు పరాకాష్టగానే రూపు దిద్దుకుంది. డబుల్ ఇంజన్ హడావుడి కూడా అదే. కేంద్రంలోని మోడీనే రాష్ట్రాలలో ఊరేగించి ఒకేసారి రాష్ట్రాలనూ కైవశం చేసుకోవచ్చనే అప్రజాస్వామిక ఆలోచన దీని వెనక వుందని అందరికీ అర్థమైపోయింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే రేషన్, ఒకే మతం...అన్న చందంగా చేసే రాజకీయమే దేశభక్తిగా చలామణి చేయడం ఎంతో కాలం చెల్లదని ఒప్పుకోవలసి వచ్చింది. జమిలి ఎన్నికలను రుద్దడం తేలిక కాదనీ పైగా ఈ సమయంలో వ్యతిరేకత కూడా తెచ్చిపెట్టవచ్చని గ్రహించిన తర్వాత ప్రస్తుతానికి కేంద్రం వెనక్కు తగ్గింది. అయితే మరోవైపున ఇందుకోసమే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన అధ్యయన కమిటీ నియమితమైంది. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండానే కేవలం మోడీ కనుసన్నలలో పూర్తయిన కొత్త పార్లమెంటు భవనంలో దీన్ని ఆమోదించడం ఆసక్తికరం. మోడీ విధేయత కారణంగా గతంలో రాష్ట్రపతి పదవి పొందిన కోవింద్‌నే మళ్లీ తెరపైకి తేవడం యాదృచ్ఛికం కాదు. వాస్తవానికి పదవీ విరమణ చేసిన ఒక రాష్ట్రపతికి అధికారిక బాధ్యత అప్పగించడం ఇదే ప్రథమం. కేంద్ర ప్రభుత్వ అధికారులను కమల ప్రచారకులుగా వాడుకోవడం కోసం ఉద్దేశించిన 'రథ్ ప్రభారీ' ప్రహసనం ఆ విధంగానే విమర్శల పాలైంది. కేంద్ర పథకాల ప్రచారమంటూ అధికారులను స్వంత పార్టీ సైన్యంగా మార్చేసుకుని ఆ ముసుగులోనే పార్టీ ప్రచారం చేయించుకోవడానికి పెట్టుకున్న 'రథ్ ప్రభారీ' పేరును చల్లగా మార్చుకోవలసి వచ్చింది. ఎన్నికల కమిషన్ నోటీసుతో ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాలలోనూ ఈ కార్యక్రమం వుండబోదనే ప్రకటనా చేయవలసి వచ్చింది. అయితే ప్రధాని దీన్ని ప్రారంభించడం, దేశ వ్యాపితంగా ఈ ప్రచార ప్రహసనం యథా విధంగా కొనసాగుతుంది. అంటే మౌలికంగా మోడీ ఆలోచనా ధోరణిలో గానీ రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలలోగానీ మార్పు లేదని స్పష్టమవుతుంది.



తెలకపల్లి రవి

> **రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయకుండా పరాధీనతలోకి నెట్టడం, నిధులు కేటాయించకపోవడం నిరంతర ప్రహసనంగా మారింది. ఎ.పి, తెలంగాణల అనుభవమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కేరళ నిరంతరం దీనిపై పోరాడుతూనే వుంది. నిధులు ఇవ్వకపోవడం, తెచ్చుకునే అప్పులపై ఆంక్షలు పెట్టడం రాష్ట్రాలను అడకత్తెరలోకి నెడుతున్నది.**

రాముడి ఆశీస్సులు ఆయనకేనా?

అయిదు రాష్ట్రాల ఎన్నికలలో బలాబలాలను బట్టి, రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే బిజెపికి పెద్ద అనుకూలత లేదని చాలా చోట్ల ఓడిపోవచ్చనీ సర్వేలు చెబుతున్నాయి. మూడు హిందీ రాష్ట్రాలలో పాతవారిని కొనసాగించలేని, ప్రస్తుతమున్న వారిని కొనసాగించలేని స్థితిలో బిజెపి వుంది. ఈ సంకట స్థితిని అధిగమించడానికి రామభక్తి నుంచి రాజకీయ కుయుక్తుల వరకూ దేనికీ వెనకాడటం లేదు. అయోధ్య పరిణామాలు, సుప్రీంకోర్టు తీర్పు...తదితర అంశాలు మళ్లీ ముందుకొచ్చాయి. 2019 ఎన్నికలు ముగియగానే అయోధ్యలో భూమి పూజలో ప్రధాని మోడీ ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు కూడా అయోధ్య ట్రస్టు ప్రతినిధులు మోడీని కలిసి 2024 జనవరిలో విగ్రహ మహా ప్రతిష్టాపనకు హాజరు కావలసిందిగా ఆహ్వానం అందించారు. ఆయన దాన్ని మీడియాలో పెద్ద విషయంగానే ప్రచారంలో పెట్టారు. బిజెపి మిత్రపక్షంగా దీర్ఘకాలం కొనసాగడమే గాక అయోధ్య ఘటనలలోనూ ఆరోపణలకు గురైన మహారాష్ట్ర శివసేన ఉద్ధవ్ థాకరే వర్గం ఎం.పి సంజయ్ రౌత్ దీనిపై స్పందిస్తూ 'రాముడు బిజెపికి, మోడీకి మాత్రమే సంబంధించిన దేవుడు కాదు కదా...' అని ఆక్షేపించారు. అయోధ్య ఆలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్‌కు ఇది చాలా కోపం తెప్పించింది. ప్రధా ని గనక పిలిచా మంటే అదోరకంగా వుండేది. మోడీకి రాముడి ఆశీస్సులున్నాయి గనకే దేశాధినేతగా అధికారం చలాయించగలుగుతున్నారని, మిగిలిన వాళ్లు వీధుల్లో తిరుగుతున్నారని ఫక్తు రాజకీయ వాదన చేశారు. మరో విధంగా చెప్పాలంటే రాముడి ఆశీస్సులు ఆయనకే వున్నాయని కితాబిచ్చారన్నమాట. అయోధ్యలో భూ మాఫియా పెరిగి కబ్జాలు, దౌర్జన్యాలు చేస్తున్నారనే వార్తలు వస్తుంటే, ఒక పూజారి కూడా వారి చేతుల్లో ఈ మధ్యనే హత్యకు గురైతే ఇంతవరకు అతీగతీ లేదు. ఈ సమయంలోనే వారణాసిలో జ్ఞానవాపి మసీదు, బృందావన్ లో కృష్ణమందిరం సమస్యలను కోర్టుల్లో తిరిగి తీసుకురావడం కూడా ఈ మత రాజకీయంలో భాగమే. ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రావణ దహనంలో పాల్గొంటూ మోడీ పరోక్షంగా ఎవరైతే కుల గణన పేరిట ప్రజల్లో చీలికలు తెస్తున్నారో వారిని కూడా ఇలాగే దహనం చేయాలని తీవ్రమైన మాటన్నారు. 'ఇండియా' వేదికను దృష్టిలో పెట్టుకునే ప్రధాని ఇంత మాటన్నారని మీడియా పోల్చి రాసింది.

మార్క్సిస్టులపై దాడి, నచ్చిందే చరిత్ర!

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ సంప్రదాయికంగా చేసే దసరా ప్రసంగంలో ఇంచుమించు ఇదే సెలవిచ్చారు. సాంస్కృతిక మార్క్సిస్టులను, వోక్ పీపుల్ (మేల్కొల్పు జనాభా)ను తోసిపుచ్చాలని భగవత్ ఉవాచ. కొన్నేళ్ల కిందట మోడీ లోక్‌సభలో ఆందోళన జీవులంటూ అపహాస్యం చేయడం గుర్తుండే వుంటుంది. ఈ మాటలన్నీ కూడా చైతన్యం, కదలిక తీసుకొచ్చే వారిపైన ఎక్కుపెట్టబడిన ఆయుధాలే. పశ్చిమ దేశాల్లో విముక్తి కోసం పోరాడేవారిని వోక్ పీపుల్ అంటుంటారట. దేశంలో సమస్త అనర్థాలకూ వారే మూల కారణమని మోహన్ భగవత్ ప్రకటించారు. వీరు ప్రజల్లో అసంతృప్తి పెంచుతారట, చీలికలు తెస్తారట, ఆఖరుకు మణిపూర్‌లో కూడా వీరి వల్లనే కుకీ, మైతేయిల మధ్య తగాదా వచ్చిందట. ఈ దేశంలో వున్నవారంతా హిందువులేనని ప్రకటించిన సర్ సంఘ్‌చాలక్ నోట ఈ మాటలు రావడం దేనికి నిదర్శనం? సనాతన ధర్మమే శరణ్యమనే సంఘపరివార్ భావమే అది. అల్ప సంఖ్యాకులు, అణగారిన వర్గాలు, మహిళలు నోరు మూసుకుని పడుంటే ఏ గొడవలు రావని తాత్పర్యం. రాజ్యాంగం మొదటి అధికరణమే చెబుతున్నట్టు 'ఇండియా దటీజ్ భారత్'గా గాక ఈ దేశాన్ని భారత్ అనే పిలవాలని తీర్మానించడం కూడా ఈ మహా పథకంలో భాగం. ఇండియా పేరుతో పాటు దాని చరిత్రనూ మార్చడం దాని కార్యాచరణ రూపం. జరిగిన చరిత్రను మరింత శాస్త్రీయంగా ప్రామాణికంగా పరిశోధించి భావితరాలకు అందించడం గాక హిందూ రాజులను కీర్తించే విధంగా చరిత్ర పాఠాలుండాలని, మొఘల్ చరిత్ర తీసేయాలనీ ఎన్‌సిఇఆర్‌టి చెప్పడమూ అందుకే. అంతేనా? చరిత్రకూ పురాణాలకూ మధ్య తేడా చెరిపెయ్యాలి. చంద్రయాన్ పాఠంతో పాటు ప్రాచీన కాలంలోనే మనవాళ్లు ఆకాశ విహారం చేశారనీ పుష్పక విమానం వుండేదనీ చెప్పాలని ఎన్‌సిఇఆర్‌టి ఆదేశం. ఇదే సమయంలో నిజమైన చరిత్రలో అవసరమైన అంశాలు తెలియకుండా చేయడం కోసం గాంధీజీ హత్య, గుజరాత్ మత హత్యాకాండ వంటివి తీసేయాలి. ఇవి అమలులోకి రావడం తర్వాత జరిగినా ముందు ఈ వార్తలు విడుదల చేయడం ద్వారా మత చాందసాలను సంతృప్తి పరచాలి. అయితే విద్యారంగం ఉమ్మడి జాబితాలో వుంది గనక, పాఠ్యాంశాల పరంగా నిర్ణయాలు రాష్ట్రాలు తీసుకుంటాయి గనక కొత్త విధానం వాటిపై రుద్దడం జరుగుతున్నది. కేరళ, తమిళనాడు, బెంగాల్ వంటి రాష్ట్రాలు ఇందుకు గట్టిగా నిరాకరించినా ఎ.పి తో సహా పలు రాష్ట్రాలు అత్యుత్సాహంగా అమలు చేయడం ఆందోళన కలిగించే వాస్తవం. సహకార రంగం తమ అదుపులోకి తెచ్చుకోవడానికి అడుగులు వేస్తున్నారు. పర్యాటక రంగం కూడా తమ అధీనంలోకి తీసుకుంటున్నారు.

రాష్ట్రాలపై ఆర్థిక బిగింపు

ఈ ఏకపక్ష కేంద్రీకృత, రాజకీయ సాంస్కృతిక ఆధిపత్య ధోరణిని చలాయించడం కోసం మరింత వేగంగా ఆర్థిక కేంద్రీకరణ తీసుకొస్తున్నారు. పరిమిత అధికారాలు గల ఢిల్లీ రాష్ట్ర నమూనా ఇందుకు ఆదర్శంగా కనిపిస్తున్నది. సుప్రీంకోర్టులోనే ఇందుకు వ్యతిరేకంగా తీర్పు రాగా రాజ్యాంగ సవరణతో తోసిపుచ్చి సర్వాధికారాలు చేజిక్కించుకుంది కేంద్రం. ఉప ముఖ్యమంత్రితో సహా ఆ రాష్ట్ర నేతలను ఖైదు చేసి అడుగడుగునా ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డు తగులుతున్నది. జమ్మూ కాశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడంలో మతతత్వ రాజకీయమూ కేంద్ర పెత్తనమూ రెండూ వున్నాయి. అసలు స్వాతంత్ర్యానంతరం ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం ఇదే ప్రథమం. రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయకుండా పరాధీనతలోకి నెట్టడం, నిధులు కేటాయించకపోవడం నిరంతర ప్రహసనంగా మారింది. ఎ.పి, తెలంగాణల అనుభవమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కేరళ నిరంతరం దీనిపై పోరాడుతూనే వుంది. నిధులు ఇవ్వకపోవడం, తెచ్చుకునే అప్పులపై ఆంక్షలు పెట్టడం రాష్ట్రాలను అడకత్తెరలోకి నెడుతున్నది. అప్పులు పెరిగాయని మళ్లీ ఆ బిజెపి నేతలే గగ్గోలు మొదలెడతారు. రాష్ట్రాల వాటా తేల్చే ఫైనాన్స్ కమిషన్ పరిధినే తగ్గించడంతో పాటు చేసిన సిఫార్సులనూ కేంద్రం తొక్కిపడుతుంది. జిఎస్‌టి కారణంగా పెట్రోలు, డీజిల్ తప్ప మరేవీ రాష్ట్రాలకు అందకుండా పోయాయి. మిగిలిన మేరకైనా రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా సెస్సులు, సర్ చార్జిలను పెంచి వాటికి వాటా లేకుండా చేస్తారు. రాష్ట్రాలపై శత్రుపూరితంగా దుష్ప్రచారం చేస్తారు. బీహార్‌లో ఎఐఐఎంఎస్ పెట్టడానికి రాష్ట్రాలు సరైన స్థలం చూపించలేదని తెలంగాణలో కిషన్‌రెడ్డి, బీహార్‌లో మన్సుఖ్ మాండవీయ ఒకే విధమైన ఆరోపణలు చేస్తారు. రైల్వేలకు కేరళ సహకరించలేదని మంత్రి అశ్వనీ వైష్ణవ్, కర్ణాటక తోడ్పడలేదని రాజీవ్ చంద్రశేఖర్ తిట్టిపోస్తారు. సంక్షేమ పథకాలను వక్రంగా చిత్రించడమే గాక సహాయ నిరాకరణ చేస్తారు. కర్ణాటక ప్రభుత్వం 'అన్న భాగ్య' పేరిట పథకం చేపట్టి ఎఫ్‌సిఐతో ఒప్పందం కుదుర్చుకుంటే కేంద్రం ఒత్తిడి తెచ్చి రద్దు చేయిసుస్తుంది. పంజాబ్‌లో 'ఆప్' పథకాల పైనా కేంద్ర మంత్రులు దాడి చేస్తారు. రాష్ట్రాలకేగాక కేంద్రం అదుపు కూడా లేకుండా 'పి.ఎం కేర్స్' పేరిట భారీ నిధి వసూలు చేస్తారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సహాయం చేసిన వారికి పన్ను, పి.ఎం కేర్స్ అయితే కార్పొరేట్ సామాజిక బాధ్యత అంటూ వివక్షత చూపిస్తారు.

చెదురుమదురుగా కనిపించే ఈ అంశాలన్నీ ఒక్కచోటికి చేర్చి చూస్తే మోడీ సర్కార్ కుటిల వ్యూహం ఏమిటో బోధపడుతుంది. కులం, మతం, జాతి దురభిమానం వంటివి రగిలించడం ఒకవైపు దేశ విశాలత్వాన్ని భిన్నత్వాన్ని చూపే రాష్ట్రాల వనరుల హక్కుల పైన దాడి మరోవైపు చేయడం ద్వారా వాటిని బలహీనపర్చాలి. తద్వారా రాష్ట్రాలలో తమను బలంగా సవాలు చేస్తున్న ప్రతిపక్షాలను దెబ్బ తీయాలి. ప్రధాని మోడీనే సర్వశక్తిమంతుడుగా, సకల నిర్ణయ సంధాతగా చూపించాలి. మిగిలిన నేతలనూ పార్టీలనూ ఆఖరుకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూడా డమ్మీలను చేయాలి. అయితే చైతన్యవంతులైన భారతీయులు, రాజ్యాంగం, న్యాయస్థానాలు... అన్నిటినీ మించి ప్రజా న్యాయస్థానం అందుకు అవకాశమివ్వడం కల్ల.

> **ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ సంప్రదాయికంగా చేసే దసరా ప్రసంగంలో ఇంచుమించు ఇదే సెలవిచ్చారు. సాంస్కృతిక మార్క్సిస్టులను, వోక్ పీపుల్ (మేల్కొల్పు జనాభా)ను తోసిపుచ్చాలని భగవత్‌ఉవాచ. కొన్నేళ్ల కిందట మోడీ లోక్‌సభలో ఆందోళన జీవులంటూ అపహాస్యం చేయడం గుర్తుండే వుంటుంది. ఈ మాటలన్నీ కూడా చైతన్యం, కదలిక తీసుకొచ్చే వారిపైన ఎక్కుపెట్టబడిన ఆయుధాలే.**

> **అయిదు రాష్ట్రాల ఎన్నికలలో బలాబలాలను బట్టి, రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే బిజెపికి పెద్ద అనుకూలత లేదని చాలా చోట్ల ఓడిపోవచ్చనీ సర్వేలు చెబుతున్నాయి. మూడు హిందీ రాష్ట్రాలలో పాతవారిని కొనసాగించలేని, ప్రస్తుతమున్న వారిని కొనసాగించ లేని స్థితిలో బిజెపి వుంది. ఈ సంకట స్థితిని అధిగమించ డానికి రామభక్తి నుంచి రాజకీయ కుయుక్తుల వరకూ దేనికీ వెనకాడటం లేదు.**

నిరంతర పరిశోధకుడు 'నాగసూరి'

సందర్భం

సాహిత్యం, జర్నలిజం, సైన్స్ తదితర రంగాల్లో తనదైన ముద్ర వేసి..భవిష్యత్ తరాలకు ఆయా అంశాల్లో పాఠ్యగ్రంథాలను అందించిన నిరంతరాన్వేషి.. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్. ఇదివరకటి అనంతపురం జిల్లా నేటి శ్రీసత్యసాయి జిల్లాలోని సోమందేపల్లి మండలంలోని కొనతట్టుపల్లి వారి స్వగ్రామం. కనీస సదుపాయాలు లేని ఆ చిన్న ఊరిలో పుట్టి స్వయంకృషి, సమయపాలనలతో ఎల్లలు దాటి తన బహుముఖ ప్రతిభను చాటారు. ఆకాశవాణిలో కార్యనిర్వాహకుడిగా (ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్) నాగసూరి ప్రస్థానం మొదలైంది. పనాజీ (గోవా), ఢిల్లీ, అనంతపురం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కడప, చెన్నై, తిరుపతి వంటి ప్రధాన ఆకాశవాణి కేంద్రాలలో విధులు నిర్వహించి...శ్రోతలు ఆదరించే ఎన్నో వినూత్న, విలక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నేటికీ అవి శ్రోతలను అలరిస్తుండడం చెప్పుకోదగ్గ విషయం.

ఆకాశవాణి కళాకారులకు చెల్లింపుల విషయంలో జాప్యం లేకుండా చూడడం, ఇంటర్వ్యూకి సంబంధించి ప్రశ్నావళిని సన్నద్ధం చేయడం, శాస్త్రవేత్తలు, సాహితీవేత్తలు, డబ్బింగ్ కళాకారులు, నాటక రంగ ప్రముఖులు, దర్శక, నిర్మాతలు, సంగీత దర్శకులు, గేయ రచయితలను సమన్వయం చేసి సరైన సమయానికి స్వాగతం పలకడం, ఆత్మీయంగా పలకరించడం, మర్యాదతో వారు ఆకాశవాణి గడప దాటే దాకా దగ్గరుండి ప్రతి చిన్న విషయాన్ని చూసుకోవడం, తానెంత ప్రయాస పడినా వారికి...వారి స్థాయికి సముచిత గౌరవమిచ్చి ఆర్టిస్టులకు మాత్రం కించిత్ ఇబ్బంది కలగకుండా సర్వం సిద్ధం చేయడంలో నాగసూరిది ప్రత్యేక శైలి. ఆకాశవాణిని రేడియోని ప్రధాన సామాజిక విద్యగా భావించి ఇష్టపడిన పనిలో ఎంతైనా కష్టపడడం నాగసూరిలో వున్న సుగుణం. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పదవీ విరమణ వరకూ తన కర్తవ్యాన్ని సమర్థవంతంగా పూర్తి చేయడంలో ఆ సద్గుణమే కీలక పాత్ర పోషించిందనడం అతిశయోక్తి కాదు.

2016–18 కాలంలో ఆల్ ఇండియా రేడియో తిరుపతి కేంద్రంగా నాగసూరి వేణుగోపాల్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో సైన్స్ గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో అడుగులు వేశారు. విజ్ఞాన కార్యక్రమాలైన...రండి చూసొద్దాం తారామండలం, అడగండి తెలుసుకోండి శీర్షికన ప్రశ్న–సమాధానం వంటి విజ్ఞాన కార్యక్రమాల ఆధారంగా శ్రోతల నుండి ఉత్తరాలు / ఫోన్లు / మెయిళ్ల ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి రూపొందించిన కార్య క్రమాలు కచ్చితంగా మెచ్చుకోదగ్గవి. మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా దానికి తగినట్లు నాగసూరి వేణుగోపాల్ తీర్చిదిద్దిన కార్యక్రమాలు ఆయనకు ప్రత్యేక పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. 1995 లోనే 'రేడియోస్కోపు' అనే ఆంగ్ల సైన్స్ సంచికా కార్యక్రమం దేశంలో అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమై వారికి మరింత గుర్తింపు తెచ్చింది.

నాగసూరికి రచయిత కావాలనే కోరిక 9,10 తరగతులు చదివే కాలంలోనే మొదలైందంటే ఆయన అభ్యసనం, అధ్యయనాలు ఇప్పటికే స్వర్ణోత్సవాలు జరుపుకున్నట్లు. 62 ఏళ్ల వయసు దాటేసరికి ఆయన ప్రచురించిన పుస్తకాల సంఖ్య 72. వీటిలో ఆయన స్వీయ రచనలే 45 మించి ఉన్నాయంటే ఆయన సమయపాలన ఏపాటిదో అర్థమవకపోదు. 1978లో ఎన్నికల నేపథ్యంలో మొట్టమొదటి రచన 'ఎన్నికల కోలా (హాలా) హలం' నుండి వీరి రచనా ప్రయాణం...జనరంజక విజ్ఞానం, పర్యావరణం, పత్రికా రంగం, టీవీ ఛానళ్ళు, సాహిత్యం, సామాజిక అంశాలు ఇలా అనేక రంగాలకు సంబంధించిన 3 వేలకు పైగా వ్యాసాలతో విస్తరించిందంటే దాని వెనక ఎంత అధ్యయనం, ఆసక్తి, అనురక్తి దాగివున్నాయో అర్థం చేసుకోవచ్చు. అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు రావడానికి ప్రాణ త్యాగం చేసినప్పటి పరిస్థితులపై ఆయన రాసిన వ్యాసాలు ఆలోచింపజేశాయి.

పత్రికా రంగానికి సంబంధించి ఎడిటర్లు ఏమంటున్నారు?, నార్ల బాట, పాత్రికేయపాళి, నవతరానికి నార్ల, మీడియా నాడి, మీడియా స్కాన్, మీడియా వాచ్ ఇలా అనేక పుస్తకాలు రాశారు. పత్రికలు తాము ప్రజల పక్షం అని చెప్పడానికి ప్రయత్నించాలని డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సుతిమెత్తని విమర్శతో గుర్తు చేస్తుంటారు. ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి టీవీ ముచ్చట్లు, ఛానళ్ళ విస్తృతి సీరియళ్ళ వికృతి, వార్తా మాధ్యమాల విశ్వసనీయత, ఛానళ్ళ సందడి టెక్నాలజీ హడావుడి, సమాచారం బాట సంచలనాల వేట, బుల్లితెర విశ్వరూపం, ప్రసార భాషగా తెలుగు, ఛానళ్ళ హోరు భాష తీరు, చర్చనీయాంశాలుగా ఛానళ్ళు, 'ప్రశ్నార్థకమవుతున్న విశ్వసనీయత' వంటి అనేక పుస్తకాలలో టీవీ ఛానళ్ళ తీరుతెన్నులను, బాధ్యతారాహిత్యాన్ని నిర్ద్వంద్వంగా చెప్పారు. జర్నలిజంలో పరిశోధనలు చేయాలనుకునే వారు, అసలేమీ తెలియకుండా వచ్చి జర్నలిజం అంటే ఏంటో తెలుసుకోవాలనుకునేవారికి కూడా ఈ పుస్తకాలు తిరగేస్తే చాలు...జర్నలిజం జీవితానికి కావాల్సిన అనుభవం వస్తుందనడంలో సందేహం లేదు.



కేబుల్ టీవీల రాకతో సినిమా హాళ్ల ప్రాభవం తగ్గలేదు. కంప్యూటర్ల రాకతో నిరుద్యోగ సమస్య పెరగలేదు. పైగా ఉద్యోగావకాశాలు మరింత పెరిగాయ్ కూడా. టేప్ రికార్డర్లు, క్యాసెట్లు వచ్చినపుడు రేడియో అంతరించి పోలేదు. టెలివిజన్ వచ్చినప్పుడూ ఆకాశవాణి మరుగున పడలేదు. నాటి నుంచి నేటి వరకూ ఆకాశవాణి వినే శ్రోతల సంఖ్య తగ్గలేదు. రేడియో వినడం ద్వారా బోలెడు సౌలభ్యాలున్నాయని సవివరంగా నాగసూరి వేణుగోపాల్ రాసిన వ్యాసం 'ఆకాశవాణి'ని అభిమానించే శ్రోతలందరికీ ఓ గుండె ధైర్యం.

ఎన్నో విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసిన డా.నాగసూరి వేణుగోపాల్ నేడు ప్రతిష్టాత్మక "జ్ఞానమద్ది సాహితీ పీఠం" వారి సాహిత్య సేవా పురస్కారం అందుకోబోతున్న సందర్భంగా వారికి అభినందనలు.

- మంచిపగడం దేవదాస్,
ఆకాశవాణి క్యాజువల్ అనౌన్సర్
(హైదరాబాద్ కేంద్రం)
సెల్ : 9966322423

అభిప్రాయం

ఆమె

చాన్నాళ్లకి ఆమెను మళ్లీ చూడబోతున్నానన్న ఊహే కాలు నిలవనివ్వడం లేదు. మనసునీ నిలవనివ్వడం లేదు. అంతా గమనిస్తున్న శ్రీమతి కూడా 'ఓ యబ్బో...విడ్డూరం' అని ఆటపట్టిస్తుంది. శ్రీమతికి తెలుసు కదా ఆమెతో నా అనుబంధం. అంతా చెప్పేశాను కదా. అయితే అందుకు కాదు ఆ ఆటపట్టింపు. అంత వీడలేని బంధమైతే, ఇన్నాళ్లూ మాటవరసకైనా తనని తలుచుకోలేదేమని.

నిజమే. శ్రీమతి అలా అనిందని కాదు గానీ అందులో నిజం నూటికి నూరు పాళ్ళు. నేనేనా ఇలా మారిపోయానన్న ఆశ్చర్యం. ఒకప్పుడు ఆ నులివెచ్చని ఒడిలో కుక్కపిల్లలా ఒదిగిపోయే వాడిని. జన్మంతా ఆ వెచ్చదనంలో గడిపేయాలని, అసలు ఎలాంటి పరిస్థితి లోనూ వదిలి వెళ్లకూడదని అనుకొనే వాణ్ణి. ఆమె లేకుండా బతుకుని ఊహించేవాడినే కాదు. అలాంటిది ఇలా పెళ్లయ్యాకనో లేదా ఇంకొంచెం ముందుగానేనో ఆ చిటికెన వేలు వదిలేశాను. ఇన్ని దశాబ్దాల్లో తనను తలచింది లేదు.

మొదట్లో ఎంత పలవరించే వాడిని. ఆమె సహచర్యంలో గడిపిన ప్రతీ క్షణాన్నీ నెమరు వేసుకునే వాణ్ణి. నన్ను మనసారా ప్రేమించడమే కాదు నన్ను నన్నుగా తీర్చిదిద్దింది. ఆమెతో నాకు ఎలాంటి దాపరికాలు లేవు. ఆ అవసరం కూడా పడలేదు. నేను చేసిన ప్రతీ పని ఆమెకు ఎరుకే. ఎన్ని వేషాలేసినా ఆమె ముందు బుద్ధిమంతుడు అయిపోయేవాణ్ణి. ఆకలిదప్పులు గుర్తుకు వచ్చేవి కావు. ఆమెని ఇంప్రెస్ చేద్దామని కాదు గానీ ఒక్కోసారి రాత్రీ పగలూ తెలియకుండా పని చేసేవాడిని. అయినా కష్టమనిపించేది కాదు. తను గర్వంగా చూసినట్టు అనిపించి ఇష్టమనిపించేది. ఎంతో సున్నిత హృదయం. ఎదుటి మనిషి కష్టానికి మౌనంగా కన్నీరు పెట్టుకునేది. ఆ కన్నీరు తుడవడం కన్నా నాకేదీ గొప్ప అనిపించేది కాదు. అందుకనే తెలియకుండానే కర్తవ్యంగా భావించి లీనమై పోయేవాడిని. అలసి పడుకున్నప్పుడు నిశ్శబ్దంగా చేరినా తల నిమురుతున్నట్టు తెలిసి మరింత ముడుచుకొని నిద్దరోయే వాణ్ణి.

నేనేనా తనని మరచిపోయి, విడిచి వెళ్లి ఇన్నాళ్లూ తలవనైనా తలవంది! ఇంత ప్రేమ రాహిత్యమా?

ఆమెను చూశాను. దశాబ్దాల తర్వాత...ఉద్విగ్నంగా. అలానే ఉంది. నిండు నూరేళ్ల పండుగ నాడు. ఆమె ఎవరో కాదు.

ఆ అంటే ఆంధ్ర. మె అంటే మెడికల్ కాలేజీ.

నన్ను తొమ్మిదేళ్లు మోసి పెంచిన మరో అమ్మ. గంపెడు మంది పిల్లల్ని ఏటేటా తీర్చిదిద్దుతూ కొంచెం కూడా విశ్రమించని అమ్మ.


(ఈ నెల 27,28,29 తేదీల్లో వందేళ్ల పుట్టినరోజు పండగ జరుపుకుంటున్న ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థిగా...)

- డా.డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ.

ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో రిమోట్

- ప్రజలకు మోడీ ఆర్థిక విధానాలు వివరించండి
- కేంద్ర మంత్రులకు ఆర్‌ఎస్‌ఎస్ నేతల దిశానిర్దేశం

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని మోడీ నడుపుతున్నా...ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో రిమోట్ కంట్రోల్ ఉన్నదని స్పష్టమవుతోంది. పైకి మాత్రం కేంద్రప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్‌ల మధ్య పొసగటంలేదని లీకులు వస్తుంటాయి. వాస్తవానికి అదేంలేదనేలా తాజా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికలు మొదలుకుని కేంద్రప్రభుత్వ తీరు తెన్నులను ఆర్‌ఎస్‌ఎస్ శాసించేదే జరుగుతోంది. కేంద్రమంత్రులు కూడా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ముందు మోకరిల్లక తప్పటంలేదు.


ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ నరేంద్ర మోడీ

ఏం జరిగిందంటే...

ఐదు రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నరేంద్ర మోడీ ప్రభుత్వంలోని కీలక మంత్రులతో ఆర్‌ఎస్‌ఎస్ ఓ సమావేశాన్ని నిర్వహించింది. ఆర్థిక, ఇతర రంగాలలో మోడీ అవలంబిస్తున్న విధానాలను గురించి ఓటర్లకు ఏ విధంగా వివరించాలన్న విషయంపై చర్చించింది. రెండు రోజుల క్రితం సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశానికి హోం మంత్రి అమిత్ షా, కార్మిక మంత్రి భూపేందర్ యాదవ్, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు, బీజేపీ మంత్రుల మధ్య జరిగిన సమావేశంలో వివిధ మంత్రిత్వ శాఖల పనితీరుపై సవివరంగా చర్చించారని బీజేపీ నేత ఒకరు తెలిపారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ దసరా పండుగ సందర్భంగా ప్రసంగిస్తూ 'స్వదేశీ'పై మాట్లాడిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకున్నదని ఆయన చెప్పారు.

భగవత్ తన ప్రసంగంలో స్వావలంబన గురించి ప్రస్తావించారు. 'స్వదేశీ' పైనే ఆధారపడాలని, అనవసర వ్యయాన్ని ఆపేయాలని ఆయన సూచించారు. దేశంలోని ఉద్యోగావకాశాలను పెంచాలని, దేశంలోని పెట్టుబడులను దేశంలోనే ఉపయోగించాలని, వాటిని దేశ ప్రయోజనాల కోసమే వినియోగించాలని ఉద్బోధించారు. కాగా మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలకు సంబంధించిన సమాచారాన్ని క్షేత్ర స్థాయికి తీసికెళ్లే విషయంపై సమావేశంలో చర్చించారని బీజేపీ నాయకుడు చెప్పారు. 'ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు బాగా తెలుసు. అవి బాగానే అమలవుతున్నాయి. అయితే మోడీ హయాంలో దేశం సాధించిన ఆర్థికాభివృద్ధిపై మరింత దృష్టి పెట్టి దానిని ప్రజలకు వివరించాల్సి ఉంది' అని తెలిపారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థను మోడీ ఏ విధంగా గాడిలో పెట్టారో ఓటర్లకు తెలియజేయాలని మంత్రులకు ఆర్‌ఎస్‌ఎస్ నేతలు సూచించారు. సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు మోడీ ప్రభుత్వ విధానాలను గురించి ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను లబ్ధిదారుల చెంతకు చేర్చేందుకు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. సంఘ్ అనుబంధ సంస్థలైన భారతీయ మజ్దూర్ సంఘ్, స్వదేశీ జాగరణ్ మంచ్, లఘు ఉద్యోగ్ భారతి నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కరువు సాయానికి రూపాయి కూడా విదల్చని కేంద్రం

- మోడీ సర్కార్‌పై కర్ణాటక సిఎం ఆగ్రహం

మంగుళూరు : కర్ణాటకకు కరువు సహాయం కింద కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇంతవరకు ఒక్క రూపాయిని కూడా విదల్చలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.17 వేల కోట్లు విడుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి రెండుసార్లు విజ్ఞప్తి చేసిందని కానీ ఫలితం లేదని అన్నారు. కర్ణాటక పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. మంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 116 తాలుకాలు కరువుతో బాధపడుతున్నాయని కేంద్ర బృందం కూడా అంగీకరించిందని, కాగా, రూ.33 వేల కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు రాష్ట్రం అంచనా వేసిందన్నారు. అయినా ఇప్పటివరకు కేంద్రం నుండి సానుకూల స్పందన లేదని విమర్శించారు. ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి కాంగ్రెస్ ఎంఎల్‌ఎలకు రూ.50 కోట్లు బిజెపి ఇవ్వచూపిందంటూ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, తమ ప్రభుత్వాన్ని అస్థిరీకరించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని తెలుసని, కానీ డబ్బు ఇవ్వచూపినట్లు తెలియదని అన్నారు.

2న హాజరవ్వాల్సిందే

- మహువాకు స్పష్టం చేసిన ఎథిక్స్ కమిటీ

న్యూఢిల్లీ : పార్లమెంటులో డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ ఎంపి మహువా మొయిత్రా కోరుకున్నట్టుగా విచారణ తేదీని శనివారం ఎథిక్స్ కమిటీ మార్పు చేసింది. నవంబర్ 2వ తేదీన విచారణకు రావాల్సిందేనని కమిటీ పేర్కొంది. గతంలో అక్టోబర్ 31న విచారణకు హాజరుకావాలని ఎథిక్స్ కమిటీ ఆమెకు నోటీసులిచ్చింది. అయితే ఆ నోటీసులు తనకు అందేముందే మీడియాలో లీక్ అయిందని.. టీవీల్లో ప్రసారం చేశారని ఆమె ఆరోపిస్తూ ఎథిక్స్ కమిటీకి లేఖ రాసింది. 30 నుంచి నవంబర్ 4 వరకు తన నియోజకవర్గంలో ముందుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమాల వల్ల తాను విచారణకు రాలేనని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. తన విచారణ తేదీ మార్చాలని ఆమె లేఖలో పేర్కొన్నారు. అయితే ఆమె కోరుకున్నట్టుగా నవంబర్ 4వరకు కాకుండా.. నవంబర్ 2వ తేదీన కమిటీకి తన వాదనల్ని సమర్పించాలని ఈ మేరకు ఆమెకు సమన్లు పంపింది. ఇకపై విచారణ తేదీ మార్చడం కుదరదని కమిటీ స్పష్టం చేసింది.

బిజెపి నేత, నటుడు సురేష్ గోపి వెకిలి చేష్టలు

- మహిళా జర్నలిస్టు పట్ల అనుచిత ప్రవర్తన
- తీవ్రంగా ఖండించిన జర్నలిస్టు సంఘాలు

తిరువనంతపురం : బిజెపి నేత, నటుడు సురేష్ గోపి ఒక మహిళా జర్నలిస్టు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. కొజికోడ్‌లో విలేకర్ల సమావేశంలో పాల్గొన్న సురేష్ గోపి, మహిళా జర్నలిస్టు అనుమతి లేకుండానే ఆమెను పదే పదే తాకాడు. సురేష్ గోపి వైకిలి చేష్టలపై మహిళా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. తనను అవమానించారంటూ జిల్లా ఎస్పీకి బాధిత జర్నలిస్టు ఫిర్యాదు చేశారు. కేరళలో ఇంతవరకు ఒక్క సీటు కూడా గెలవకపోవడంపై సదరు మహిళా జర్నలిస్టు గోపిని ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ ఆమె భుజంపై పదేపదే చేయి వేస్తూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో కూడా వైరల్ అవుతోంది. బాధిత మహిళా ఆయన చేయి తీసిపారేస్తున్నా ఆయన తన వెకిలిచేష్టలు ఆపలేదు. 'మమ్మల్ని ప్రయత్నించనీ తల్లీ..' అంటూ చేయి వేస్తూనేవున్నారు. సురేష్ వైఖరిని గమనించిన ఆమె గట్టిగా తోసివేసిన దృశ్యాలు వీడియోలో కనిపించాయి.



ఇది మహిళలను అవమానించడమేనని కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ విమర్శించింది. మహిళా కమిషన్‌కు దీనిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపింది. సదరు నేత బాడీ లాంగ్వేజ్ అసభ్యంగా, అనుచితంగా వుందని నెట్‌వర్క్ ఆఫ్ వుమెన్ ఇన్ మీడియా, ఇండియా విమర్శించింది. పని ప్రదేశాల్లో వేధింపులుగా దీన్ని చూడాలని పేర్కొంది. ఈ చర్య తీవ్రతను గమనించి రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్య తీసుకోవాలని కోరింది. ఆ తర్వాత ఆమెను తన కూతురిగా భావించే అలా చేయివేశాను తప్ప మరే ఉద్దేశ్యం లేదంటూ గోపి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆమెకు మనస్తాపం కలిగితే తాను క్షమాపణలు చెబుతానన్నాడు. ఆ తర్వాత ఆ బాధిత జర్నలిస్టు తన ఫేస్‌బుక్ పేజ్‌లో ఒక పోస్టు పెడుతూ ఇప్పటికీ కూడా తన ప్రవర్తన తప్పుగా వుందని ఆ వ్యక్తి భావించనపుడు ఆ క్షమాపణలకు కూడా అర్థం లేదని అన్నారు. సురేష్ గోపి చర్యను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి ఆర్.బిందూ, ప్రతిపక్ష నేత సతీశన్, కాంగ్రెస్ నేత మురళీధరన్, సిపిఎం ఎంపి రహీమ్ బిజెపి నేత తీవ్రంగా ఖండించారు.

భారత్ రైల్వేగా ఇండియన్ రైల్వే..!

- పేరు మార్చేందుకు రైల్వే మంత్రిత్వశాఖ యత్నం
- కేంద్ర మంత్రివర్గానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే మంత్రిత్వశాఖ 'ఇండియా' పేరును తొలగించి 'భారత్' పేరుతో భర్తీ చేయాలని ప్రతిపాదించింది. పేరు మార్పునకు సంబంధించి కేంద్ర మంత్రివర్గానికి తెలిపింది. భారత్ పేరు వినియోగానికి సంబంధించి ఇలాంటి ప్రతిపాదన కేంద్ర మంత్రివర్గం ముందుకు రావడం ఇదే తొలిసారి. రానున్న రోజుల్లో మరిన్ని ప్రభుత్వ శాఖలు భారత్ అనే పేరును ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు. రాజ్యాంగంలో ఇండియా, భారత్ అనే పేర్లకు సమాన ప్రాధాన్యత ఉందని, అందువల్ల కేంద్ర మంత్రివర్గం భారత్ అనే పేరును ఉపయోగించడంలో తప్పులేదని ప్రభుత్వం వాదిస్తోంది. జి-20 సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన విందుకు సిద్ధం చేసిన ఆహ్వానపత్రికలో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు బదులుగా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని రాశారు. జి-20 నేతల సదస్సులో ప్రధాని మోడీ టేబుల్ ముందు భారత్ అని రాశారు. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో కూడా ఇండియా పేరును తొలగించి, దానికి బదులు భారత్‌ను ఉపయోగించాలని ప్రతిపాదించారు.

భారత్ గైర్హాజరు దిగ్భ్రాంతి కలిగించింది

- సిపిఎం, సిపిఐ విమర్శ

న్యూఢిల్లీ : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ఆపాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు కావడం దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఎం, సిపిఐ విమర్శించాయి. ఈ మేరకు ఆ రెండు పార్టీల ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి రాజా శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. గాజాలో 'పౌరుల రక్షణ, చట్టపరమైన, మానవనతాపరమైన బాధ్యతలను పరిరక్షించడం' అన్న శీర్షికతో మానవతా ఒప్పందం కోసం పిలుపునిస్తూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అత్యధిక మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించిందని, ఓటింగ్‌కు భారత్ గైర్హాజరవడం భారత విదేశాంగ విధానాన్ని అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మలచడమేనని ఆ ప్రకటన పేర్కొంది. మోడీ ప్రభుత్వ చర్యలు అమెరికా-ఇజ్రాయిల్-భారత్ మధ్య అపవిత్ర పొత్తును మరింత సంఘటితపరిచేలా వున్నాయని పేర్కొంది. పాలస్తీనా ప్రయోజనాలకు భారత్ చిరకాలంగా కొనసాగిస్తూ వస్తున్న మద్దతును ఇది విస్మరించిందని ఆ ప్రకటనలో వారు విమర్శించారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీనీ తీర్మానం చేసిన తరువాత ఇజ్రాయిల్, గాజా స్ట్రిప్‌లో వైమానిక, భూతల దాడులను మరింత ఉధృతం చేసింది. దాదాపు 22లక్షల మంది పాలస్తీనియన్లు వున్న గాజాకు అన్ని రకాల కమ్యూనికేషన్లను నిలిపివేసింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అత్యధిక మెజారిటీతో ఆమోదించిన తీర్మానాన్ని గౌరవిస్తూ, తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని సిపిఎం, సిపిఐ డిమాండ్ చేశాయి. 1967కి ముందునాటి సరిహద్దులతో, పాలస్తీనా దేశానికి తూర్పు జెరూసలెం రాజధానిగా రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారం అని భద్రతా మండలి గతంలో చేసిన తీర్మానాన్ని అమలు చేసేందుకు, అలాగే తక్షణమే కాల్పుల విరమణ జరిగేలా చూసేందుకు ఐక్యరాజ్య సమితి తన శక్తియుక్తులనన్నిటినీ ఉపయోగించాలని సిపిఎం, సిపిఐ కోరాయి.

మైక్రోసైట్‌లతో పర్యాటకాభివృద్ధి : కేరళ

తిరువనంతపురం : కేరళ రాష్ట్రంలోని సుసంపన్నమైన, వైవిధ్యమైన వారసత్వాన్ని పెంపొందించేందుకు, ముఖ్యమైన ఆరాధనా స్థలాలను ప్రముఖంగా ప్రచారం చేస్తూ, మైక్రోసైట్‌లను తీసుకురానున్నట్లు కేరళ పర్యాటకా విభాగం ప్రకటించింది. ఇందులో భాగంగా శబరిమలపై వివిధ భాషల్లో విస్తృత సమాచారాన్ని అందచేస్తున్న మైక్రోసైట్‌ను త్వరలో ఆవిష్కరించనున్నారు. పతనంతిట్ట జిల్లాలోని శబరిమలపై పునరుద్ధరించిన మైక్రోసైట్‌లో ఐదు భాషలు ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడ, తెలుగుల్లో సమగ్ర సమాచారం వుంటుంది. రూ.61.36లక్షల వ్యయంతో చేపట్టు ఈ ప్రాజెక్టులో ఇ బ్రోచర్లు వుంటాయి. ఇదికాకుండా, ఆ సైట్‌లో ఒక చిత్రం కూడా వుంటుంది. అయ్యప్ప దేవాలయాన్నిఏటా లక్షలాదిమంది భక్తులు సందర్శించుకుంటున్నందున ఇక్కడకు జరిపే పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వుండేలా చూసేందుకు ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడింది.

బెంగాల్‌లో ఘోర ప్రమాదం

- ఆరుగురు కూలీలు మృతి

కొల్‌కతా: వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన వారు. కూలీ పనిచేస్తే గానీ పూట గడవని పరిస్థితుల్లో బతుకుతున్నారు. రోజువారీలాగే కూలీ పనికి వెళ్లారు. ఈ క్రమంలో పికప్ వ్యాన్‌లో పూలు లోడ్ చేస్తున్నారు. పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు. త్వరగా పని చేసుకుని.. కాస్త కడుపు నింపుకుందామని ఆశగా పనిలో బిజీ అయ్యారు. కానీ వారికి పొంచి ఉన్న ప్రమాదాన్ని మాత్రం పసిగట్టలేకపోయారు. పూలు లోడ్ చేస్తున్న సమయంలో అటుగా వచ్చిన ఓ లారీ వారిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు కూలీలు మృతి చెందారు. బెంగాల్‌లోని ఖరగ్‌పుర్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. 'పశ్చిమ మేదినీపుర్ జిల్లా.. ఖరగ్‌పుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బురమలా వద్ద శనివారం తెల్లవారుజామున 10 నుంచి 12 మంది కార్మికులు కలిసి పికప్ వ్యాన్‌లో పూలు లోడింగ్ చేస్తున్నారు. అకస్మాత్తుగా సిమెంట్ లారీ వెనుక నుంచి వచ్చి వరిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మరణించారు.' అని పోలీసులు తెలిపారు.

తెలంగాణలో సీట్ల సర్దుబాటుపై చర్చలు

- రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుంది
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు గురించి చర్చలు జరుగుతున్నాయని, దీనిపై పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా'ను బలోపేతం చేయడం దేశానికి



అవసరమని ఏచూరి అన్నారు. దేశ లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు 'ఇండియా' మరింత బలోపేతం కావాలని, ఇందుకోసం సిపిఎం కృషి చేస్తుందని ఆయన అన్నారు. 'ఇండియా' వేదికలోని అన్ని పార్టీల సీనియర్ నేతలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటారని, దీనికి సమన్వయ కమిటీలో న భ్యలంగా లేకపోవడం అడ్డంకి కాదని పేర్కొన్నారు. జెడిఎస్ కేరళ యూనిట్ జాతీయ నాయకత్వానికి పూర్తిగా దూరమైందని, ప్రస్తుతానికి కేరళలో జెడిఎస్‌గా కొనసాగుతున్నదని తెలిపారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షతన హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో జాతీయ రాజకీయ పరిస్థితులతోపాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సంస్థాగత అంశాలపై చర్చ జరుగుతుంది.



ఛత్తీస్‌గఢ్ తొలి విడత బరిలో 46 మంది కోటీశ్వరులు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో 46 మంది కోటీశ్వరులైన అభ్యర్థులు బరిలో వున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఖడ్గరాజ్ సింగ్ రూ.40 కోట్ల ఆస్తులతో మొదటిస్థానంలో వున్నారు. మొదటి దశలో పోటీచేసే అభ్యర్థి తలసరి ఆస్తుల విలువ రూ.1.34 కోట్లుగా వుందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్), ఛత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్‌లు ఇచ్చిన నివేదిక పేర్కొంది. నవంబరు 7న జరగనున్న మొదటి దశ ఎన్నికల్లో 223 మంది అభ్యర్థుల్లో 46 మంది కోటీశ్వరులని ఆ నివేదిక పేర్కొంది. ఇక ప్రధాన పార్టీల మధ్య చూసినట్లైతే, మొత్తంగా 20 మంది బిజెపి అభ్యర్థులు పోటీ చేస్తుండగా, బిజెపి అభ్యర్థి సగటు ఆస్తి రూ.5.33కోట్లుగా వుంది. కాంగ్రెస్ అభ్యర్థి సగటు ఆస్తి రూ.5.27కోట్లుగా వుండగా, ఆప్ అభ్యర్థులది రూ.4.45 కోట్లుగా వుంది. పోటీలో 15 మంది జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జె) అభ్యర్థులు వుండగా, వారి సగటు ఆస్తి రూ.30.54 లక్షలుగా వుందని నివేదిక పేర్కొంది. అధిక మొత్తంలో ఆస్తులున్న అభ్యర్థుల్లో మొదటి స్థానం ఆప్ అభ్యర్థి కాగా తర్వాత స్థానాల్లో బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు వున్నారు.

సంకల్ప్ యాత్రకు ఇసి బ్రేక్

- ఎన్నికల రాష్ట్రాల్లో జరపరాదని నిర్దేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సాధించిన గొప్పలను ప్రచారం చేసుకునేందుకు ఉద్దేశించిన 'వికాసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'కు కేంద్ర ఎన్నికల సంఘం బ్రేకులు వేసింది. ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లోనూ ఈ యాత్రను నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఆయా రాష్ట్రాల్లో యాత్ర చేపట్టరాదని కేంద్ర కేబినెట్ కార్యదర్శికి కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. యాత్ర ప్రయాణానికి వినియోగించే వాహనాలను రథాలుగా పిలవడాన్ని కూడా ఎన్నికల సంఘం తప్పుబట్టింది. దీంతో రథాలుగా పిలవడాన్ని విరమించుకుంటున్నట్లు కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. అధికారుల పేరును జిల్లా 'రథప్రభరిమార్' నుంచి నోడల్ అధికారిగా మార్చారు. నవంబరు 20 నుంచి జనవరి 25 వరకు జరిగే యాత్రలో కేంద్ర ఉద్యోగులను చేర్చుకోవాలనే నిర్ణయం వివాదాస్పదమైంది. యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ అధికారులను జిల్లా రథసారథులుగా నియమించడంపై ప్రతిపక్షాలు ఆగ్రహించాయి. దీంతో ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.

ఉచిత ల్యాప్‌టాప్‌లు..టాబ్లెట్‌లు

- పాత పెన్షన్ పథకానికి మద్దతు
- పశువుల పేడ కొనుగోలు
- రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు

జైపూర్ : రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ ఎన్నికల హామీల జాబితాను విడుదల చేసింది. ఓటర్లలో అధిక సంఖ్యలో ఉన్న, కీలకమైన విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా తన వాగ్దానాలను ప్రకటించింది. కాలేజీ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం చట్టం ద్వారా పాత పెన్షన్ పథకం (ఓపీఎస్)కు మద్దతుగా నిలవటం, పశువుల పేడను కొనటం వంటివి ఇందులో ఉన్నాయి. ఆయన ఇలా ఐదు కొత్త ఎన్నికల హామీలను అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రకటించింది.

ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌లోని కాంగ్రెస్ వార్ రూమ్‌లో విలేకరుల సమావేశంలో గెహ్లాట్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పశువుల పేడను కిలో రూ.2 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. "ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని భూపేష్ బఘేల్ ప్రభుత్వం మాత్రమే అటువంటి పథకాన్ని అమలు చేస్తోంది. దీనిని గోధన్ న్యాయ్ యోజనతో అమలు చేస్తున్నది. ఇది బయోగ్యాస్, సహజ ఎరువులు మొదలైనవాటిగా ఉపయోగించబడుతున్నది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది" అని గెహ్లాట్ చెప్పారు. ప్రతి విద్యార్థికీ ఇంగ్లీషు మీడియం విద్యనందిస్తామన్న హామీని ప్రకటించారు. ఇప్పటి వరకు 3 వేల ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ప్రారంభించామనీ, అందులో 6 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రస్తుతం లాటరీ విధానంలో విద్యార్థులను కేటాయించాల్సి ఉండగా, డిమాండ్ ఉన్న చోట ఇంగ్లీషు మీడియం పాఠశాలను తెరుస్తామని పార్టీ హామీ ఇస్తున్నదని తెలిపారు. దీనితో రాష్ట్రంలోని మానవ వనరుల నాణ్యత మెరుగుపడుతుందని చెప్పారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్ లేదా ట్యాబ్లెట్ ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఏటా 7-8 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) చట్టానికి మద్దతుగా కాంగ్రెస్ ఉంటుందని ఆయన చెప్పారు. ఓపీఎస్‌ను బీజేపీ వ్యతిరేకిస్తున్నందున, రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఓపీఎస్‌ను ఉపసంహరించుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు భయపడుతున్నారని ఆయన అన్నారు. అందుకే, భవిష్యత్తులో కూడా ఏ ప్రభుత్వమూ దానిని ఉపసంహరించుకోలేని విధంగా చట్టంతో మద్దతు ఇవ్వాలని మేము నిర్ణయించుకున్నామని అశోక్ గెహ్లాట్ వివరించారు. పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం చిరంజీవి ఆపద బీమా హామీని తీసుకువస్తుందనీ, ఇందులో ప్రతి బాధిత కుటుంబానికీ రూ. 15 లక్షల వరకు బీమా కల్పిస్తామని ఆయన చెప్పారు.

మొత్తం 200 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఐదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. జుంజునులో జరిగిన ర్యాలీలో పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ సమక్షంలో గెహ్లాట్ గృహ లక్ష్మి యోజన కింద కుటుంబ పెద్దలకు ఏటా రూ. 10,000 ప్రకటించారు.

అగ్నిగుండంలా మండుతున్న గాజా

- ఇజ్రాయిల్ బాంబు దాడులతో విధ్వంసం
- ఎటుచూసినా హృదయవిదారక దృశ్యాలే
- గాజాతో స్థంభించిన కమ్యూనికేషన్స్
- సహాయక సంస్థలు, దేశాల ఆందోళన

లండన్/గాజా/జెరూసలేం :

ఇజ్రాయిల్ అటు వైమానిక దాడులు, ఇటు భూతల దాడులను ముమ్మరంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో గాజా స్ట్రిప్ మండుతున్న అగ్ని గోళంగా కనిపిస్తోందని, ఎటుచూసినా మంటలు, పొగ కమ్మేశాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. అల్ జజీరా తదితర అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం గాజాలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. అక్కడ సేవలందిస్తున్న సహాయక సిబ్బందితో తమకు కమ్యూనికేషన్స్ పూర్తిగా నిలిచిపోయాయని బయట నుంచి సహాయ శిబిరాలకు సామగ్రి చేరవేస్తున్న పాలస్తీనా రెడ్ క్రెసెంట్ సొసైటీ వంటి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఇంటర్నెట్, ఫోన్ సర్వీసులు నిలిచిపోయాయి. గాజాలో వైమానిక దాడులను పెంచుతున్నామని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగరీ తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో పదాదీ బలగాలను పెంచి భూతల దాడులను విస్తరింపజేస్తున్నామని వెల్లడించారు. గాజా సిటీలోని ప్రజలు దక్షిణం వైపు వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా ఇజ్రాయిల్ దాడుల్లో దాదాపు 7500 మంది వరకు చనిపోయారు. వీరిలో 3000 మంది పైగా చిన్నారులే. కాగా ఈ నెల 7 నుంచి ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 110 మంది వైద్యులు మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. వేలాది మంది పౌరులు, వందలాది మంది వైద్య, ఇతర సహాయక సిబ్బంది గాయపడినట్లు పేర్కొంది.


గాజా సిటీలోని ఆల్ సటీ శిబిరంపై ఇజ్రాయిల్ కురిపించిన బాంబుల వర్షంతో ధ్వంసమైన భవన శిథిలాల నుంచి ఒక పసికందు మృతదేహాన్ని వెలికితీస్తున్న స్థానికులు. గాజా సిటీ మొత్తం ఇలాంటి హృదయవిదాకర దృశ్యాలే.

లండన్‌లో నిరసనల వెల్లువ

గాజాలో కాల్పుల విరమణకు పిలుపివ్వడానికి బ్రిటన్ ప్రభుత్వం తిరస్కరించడంతో నిరసనగా బ్రిటీష్ విదేశాంగ కార్యాలయం ఎదురుగా వందలాది మంది ధర్నా చేశారు. కార్యాలయం ప్రవేశమార్గం అంతటా వందలాది బొమ్మలను పెట్టారు. అందులో ఒకో బొమ్మ దాడుల్లో మరణించిన ఒకో పాలస్తీనా చిన్నారిని గుర్తు చేస్తుందని వారు పేర్కొన్నారు. లండన్‌లో ప్రభుత్వ విభాగాల కార్యాలయాల గేట్లకు పిల్లలు టెడ్డీ బొమ్మలను వేలాడదీశారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాల అమ్మకాలను ఆపాలని వారు బ్రిటన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లండన్‌లో ఇజ్రాయిల్ రాయబారి నివాసం వెలుపల కూడా విడిగా నిరసన ప్రదర్శన జరిగింది. వారం వారం జరుగుతున్న నిరసన కార్యాచరణలో భాగంగా లండన్‌లో ఆదివారం వేలాదిమందితో ప్రదర్శన జరగనుంది.

ఆక్రమణలను ఆపే ఉద్దేశ్యం ఇజ్రాయిల్‌కు లేదు : నవీ పిళ్ళై

అక్రమంగా 56ఏళ్ళుగా కొనసాగుతున్న ఆక్రమణలను కొనసాగించేందుకే గాజాపై ఇజ్రాయిల్ పదే పదే దాడులకు దిగుతోందని, ఆ ఆక్రమణను అంతమొందించే ఉద్దేశ్యమేమీ ఇజ్రాయిల్‌కు లేదని ఐక్యరాజ్య సమితి విచారణా కమిషన్ ఛైర్‌పర్సన్ నవీ పిళ్ళై చెప్పారు. పాలస్తీనా ప్రాంత అక్రమ ఆక్రమణపై విచారణా కమిషన్ ఇంతకుముందే చర్చించింది. అక్టోబరు 7న దాడులు జరగడానికి ముందుగానే కమిషన్ నివేదికను విడుదల చేశారు.

గాజాలో అన్ని రకాల కమ్యూనికేషన్లను ఇజ్రాయిల్ నిలిపివేసింది. ఆ తర్వాత పదాతి దళ దాడులను విస్తరిస్తున్నట్లు తెలిపింది. ఉత్తర గాజాలో దాడులు విస్తరించినట్లు ఇజ్రాయిల్ బలగాలు ప్రకటించాయి.

వేలాదిమంది గాజా వర్కర్ల బంధీ

ఇజ్రాయిల్‌లో పనిచేయడానికి పర్మిట్లు వున్న పాలస్తీనియన్ల పర్మిట్లను రద్దు చేసి వారిని నిర్బంధ శిబిరాల్లో వుంచినట్లు తెలుస్తోందని మానవ హక్కుల గ్రూపులు తెలిపాయి. అయితే వారి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించడానికి ఇజ్రాయిల్ తిరస్కరించింది. యుద్ధం ప్రారంభమవడానికి ముందుగా వేలాదిమంది గాజా వర్కర్లు ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్నారు. మూకుమ్మడి అరెస్టులు జరిగాయన్న ప్రచారం నేపథ్యంలో వారందరీ ఆచూకీ గల్లంతైంది.

ప్రాణాలు బలిగొన్న పొగమంచు

- హైవేపై ఢీకొన్న వాహనాలు
- 32 మంది మృతి

కైరో : ఈజిప్ట్ రాజధాని కైరోలో దట్టంగా కమ్మేసిన పొగమంచు 32 మంది ప్రాణాలను బలిగొన్నది. జాతీయ రహదారిపై శనివారం ఉదయం మంచు కారణంగా దృగ్గోచర కాంతి లేకపోవడంతో పదుల సంఖ్యలో వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో 32 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 63 మంది గాయపడ్డారు. కైరోకు ఉత్తరంగా 160 కిలోమీటర్ల దూరంలో నుబరియా పట్టణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తొలుత కైరోకు వెళ్తున్న బస్సు హైవేపై ఆగివున్న వాహనంలోకి పాసింజర్ బస్సు దూసుకువెళ్లింది. అటుపై పలు వాహనాలు ఢీ కొన్నాయని, కొన్ని కార్లు బస్సులోకి దూసుకెళ్లాయని అధికారులు తెలిపారు. పొగ మంచు దట్టంగా వుండడమే ప్రమాదానికి కారణమని తెలిపారు. మొత్తంగా 29 వాహనాలు ఈ ప్రమాదం బారిన పడ్డాయి. హైవేలపై దట్టంగా పొగమంచు కమ్ముకుంటోందని శుక్రవారమే హైవే అథారిటీ ప్రకటించింది.

ఐరాస సహాయక శిబిరాల్లో 6.5 లక్షల మంది

గాజా : మధ్య ధరా సముద్రపు ఒడ్డున ఉన్న ఈ చిన్న భూఖండాన్ని (గాజా స్ట్రిప్)లో 23 లక్షల మంది పాలస్తీనీయులు ఉంటున్నారు. గాజాపై దాడుల తరువాత ఆరున్నర లక్షల మంది పాలస్తీనీయులు ఐరాస సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఈ శిబిరాల్లో ఇంధనం, ఆహార నిల్వలు అడుగంటిపోయాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ నిలిచిపోవడంతో ఈ ప్రాంతంలో పూర్తి అంధకారం నెలకొంది. ఈ సంక్షోభాన్ని తన ఆధిపత్యాన్ని తిరిగి పటిష్టపరచుకోడానికి ఎలా వాడుకోవాలా అన్నదాని గురించి అమెరికా పన్నాగాలు పన్నుతున్నది. ఎకనామిస్ట్ మ్యాగజైన్ అమెరికాను ఎగదోసేలా బహిరంగంగానే ఇలా వ్యాఖ్యానించింది. ' ఈ యుద్ధం అమెరికా తాను పట్టుకోల్పోతున్న ప్రాంతంపై తిరిగి తన పట్టును నిలుపుకోడానికి ఇదొక గడ్డ పరీక్ష ' అని పేర్కొంది. సిరియా, ఇరాక్‌పై అమెరికా బాంబు దాడులకు దిగడం ఈ ఆధిపత్య వ్యూహంలో భాగమే. ఈ చర్యను సమర్థించుకోడానికి అక్కడి తన సైనికులపై ప్రత్యర్థులు దాడులు చేస్తున్నారని, దానికి ప్రతిగానే ఈ దాడులు అని అమెరికా చెబుతోంది. నిజానికి అక్కడ అమెరికా సైనికులు ఎవరూ లేరు. నిన్న మొన్నటి వరకు బద్ధ విరోధులుగా ఉన్న సౌదీ అరేబియా, ఇరాన్ చైనా మధ్యవర్తిత్వంలో ఒక్కటవ్వడంతో ఇజ్రాయిల్ ఒంటరిపాటైంది. ఈ పరిస్థితిలో సిరియా, ఇరాన్, లెబనాన్‌లను ప్రాంతీయ యుద్ధంలోకి లాగాలని అమెరికా చూస్తోంది.



మీకోసం

నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.

జీవన సౌరభం

తెలివిగలవారు ఎప్పుడూ వైఫల్యం పొందిన చోట నుంచే విజయం సాధించడం ప్రారంభిస్తారు.

వినువీధిని వీక్షించుము



వినువీధిని తారలుండు
వింతగదా రాలకుండు
వీక్షించుము ఓ బాబూ!
వినిపించుము నీ జవాబు!!

తోకచుక్కలుంటాయట
తాకబోకు అంటాయట
వాకలుగా కాంతిపారు
వాటితీరు చెప్పితీరు!

ఉలికులికీ పడతాయట
ఉల్కాపాత మంటారట
మొలక చుక్కలుంటాయట
పలుకరించి చూడు బాబు!

గుంపులుగా చుక్కలుండు
కెంపులుగా మెరయుచుండు
శంపాలత చుట్టాలవి
సంపుటాలు వ్రాయుబాబు


రాశులుగా చుక్కలుండు
రాశికొక్క నామముండు
చూసినవాని పేర్లు చెప్పు
గురుతులతో గుట్టు విప్పు!

లెక్కలేని గ్రహాలుండు
లెక్కలతో తిరుగుచుండు
తారలకే చుట్టాలివి, వాటి
దారి చెప్పు బాబు!

మనమున్నది భూమిపైన
ఘన గ్రహములు ఏడుపైన
మనకుగలడు చంద్రుడొకడు
కనుగొనుమింకెన్నికలవో?

కాంతి వేగమెంతెంతో
కానరాని చుక్కలెన్నో?
వీక్షించుము ఓ బాబు!
వినిపించుము నీ జవాబు!!

కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, రామభద్రపురం.



కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన రంగుల బూరలను అంకెలుగా గణించి ఎదురుగా ఉన్న సమాధానం రాబట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



షేక్. సుహానా, 6వ తరగతి, పులివెందుల, నారాయణ స్కూల్.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శీతాకాలం జ్వరాలపై అప్రమత్తత అవసరం



శీతాకాలంలో చల్లటి వాతావరణాన్ని ఆనందిస్తూనే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. సీజన్ మారే సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారుతుంటుంది. ఈ మార్పుని శరీరం ఒక్కసారిగా గుర్తించి సర్దుబాటుచేసుకోవటం కాస్త కష్టమే. ఒక్కోసారి ఒక్కసారిగా చలిగాలులు విజృంభిస్తాయి. కేవలం ఈ సమయంలోనే కొన్ని రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లుగా చురుగ్గా మారతాయి. చలిగాలిలో తిరుగుతుంటే ఈ సూక్ష్మక్రిములు శరీరంలోకి చేరతాయి. తగినంత రోగ నిరోధక శక్తి ఉన్నట్లయితే ఈ క్రిములు ఏమీ చేయలేవు. లేనిపక్షంలో ఈ క్రిములు వ్యాధుల్ని కలుగ జేస్తాయి. ఈక్రమంలో సూక్ష్మక్రిములకు వ్యాధి నిరోధక కారకాలకు శరీరం లోపల ఘర్షణ చెలరేగుతుంది. దీని ఫలితంగా జ్వరం, నొప్పులు బయటపడతాయి. సాధారణంగా ఈ కాలంలో కొన్ని అనారోగ్య సమస్యలు ఎక్కువవుతాయి. ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వాటిని నివారించొచ్చు.



శీతాకాలంలో గాలి, నీటిలో క్రిమికీటకాల వ్యాప్తి ద్వారా కూడా వ్యాధులు వ్యాపిస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు అతిత్వరగా వ్యాప్తిచెందుతుంటాయి. మరికొన్ని ఇన్ఫెక్షన్లు పొట్ట, రోగ నిరోధక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుంటాయి. వీధుల వెంబడి విక్రయించే కలుషిత ఆహారం తినటం ద్వారానూ, కల్తీ ఆహార పదార్థాలను స్వీకరించటం ద్వారాను వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వివిధ రకాల కాలుష్యాలు, సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల గాలి ద్వారా, వర్షపునీటి ద్వారా వచ్చే దోమల కారణంగా రోగాలు వ్యాప్తిచెందుతాయి. ఈ సమస్యలు చుట్టుముట్టినప్పుడు అలసట, నీరసంతో ఇబ్బందులు పడతారు. ఏ పని చేయాలన్నా చురుకుదనం ఉండదు. ఎంతసేపు ఒంటినొప్పులు, ఇతర సమస్యలతో మంచం నుంచి లేవాలని అనిపించదు. పిల్లలు తరచుగా, వృద్ధులు జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులతో బాధపడుతుంటారు. రాత్రి మొదలు ఉదయం వరకూ విపరీతమైన మంచు కురిసే పరిస్థితులు కూడా ఉంటాయి. చలికాలంలో సరిగా దాహం వేయదు. అయినా సరే, తగిన మోతాదులో నీటిని తాగాలి. వేడి ఆహార పదార్థాలు, తాజాపండ్లు, కూరలు తీసుకోవటం మంచిది. ఒత్తిడికి దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం అలవాటు చేసుకోవాలి. చలికాలంలో సాధారణంగా గొంతునొప్పి, తలనొప్పి, దగ్గు, ఫ్లూ, జ్వరం, జలుబు వంటివి వ్యాప్తి చెందుతాయి. అయితే కాచి చల్లార్చిన నీటిని తాగటం, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవటం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు డాక్టర్‌ను సంప్రదించటం ఉత్తమం.



డాక్టర్ జి.రమేష్‌నాయుడు,
తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,
పొందూరు మండలం,
శ్రీకాకుళం జిల్లా.

జ్వరం : శీతాకాలంలో సాధారణంగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతాయి. అందువల్ల వైరస్‌లకు వ్యాప్తి చెందే శక్తి పెరుగుతుంది. విష జ్వరాలు కూడా ఎక్కువగా వస్తుంటాయి. వాతావరణంలో మార్పు కారణంగా చాలామందిలో తరచుగా జ్వరం వస్తుంది. శరీర ఉష్ణోగ్రత 98.6-101 డిగ్రీల ఫారెన్ హీట్ వరకూ ఉంటే దానిని సాధారణ జ్వరంగానే పరిగణించొచ్చు.

ఆస్తమా (ఉబ్బసం) : ఆస్తమాతో బాధపడేవారు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. గొంతునొప్పి, కఫం, ఛాతీబిగుతు శ్వాస ఆడకపోవటానికి కారణమవుతుంది. ఇది ఉబ్బసానికి కూడా దారితీస్తుంది.



న్యూమోనియా : ఊపిరితిత్తులకు కలిగే వ్యాధే న్యూమోనియా. ఈ వ్యాధి వైరస్, బ్యాక్టీరియా, క్షయవాధి వల్ల వ్యాప్తిచెందుతుంది. పొగతాగడం, చలిగాలిలో తిరగడం, కుటుంబ పరంగా అస్తమా, అనారోగ్య పరిస్థితుల వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రెండేళ్లలోపు చిన్నారుల్లోనూ, 65 ఏళ్లు పైబడిన వారిలో ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ.

ఫ్లూ : చాలామందిని ఇబ్బంది పెడుతుంది. రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారికి ఫ్లూ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తులు తరచుగా ముక్కు, కళ్ళు, చెవులను తాకటాన్ని మానుకోవాలి.

జలుబు : సీజన్ మారే క్రమంలో చాలామందికి గొంతునొప్పి తరువాత దగ్గు, జలుబు వస్తాయి. శీతాకాలంలో చిన్న పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా వచ్చే సీజనల్ జలుబు, దగ్గుతో ఇబ్బందిపడుతుంటారు. వాతావరణంలో మార్పులు, తాగేనీటిలో మార్పులతో కూడా పిల్లల్లో జలుబు లక్షణాలు పెరుగుతాయి.

చర్మవ్యాధులు : చర్మవ్యాధులైన సొరియాసిస్, దురద లాంటివి ఎక్కువగా వస్తాయి. ముఖంపై మొటిమలు, కాళ్ల పగుళ్లు, చర్మంపై మచ్చలు పడటం, చెడిపోవడం వంటి ఇబ్బందులు ఉంటాయి. పలు రకాల ఫంగస్ ఇన్ఫెక్షన్లు కూడా సోకుతాయి. దీనిని నివారించటానికి శరీరాన్ని ఎప్పుడూ తేమగా ఉంచుకోవాలి.

గొంతునొప్పి : చలికాలంలో చాలామందిని ఇబ్బంది పెట్టే ప్రధాన సమస్యల్లో గొంతునొప్పి ఒకటి. సీజన్ మారే సమయంలో చాలామందికి ముందుగా ఈ నొప్పి వస్తుంది. గొంతులో ఇన్‌ఫెక్షన్ కారక సూక్ష్మక్రిములు చేరటం వల్ల ఈ నొప్పి మొదలవుతుంది. దానివల్ల సరిగ్గా మాట్లాడలేకపోవటం, గొంతులో గరుకుగా ఉండటం వంటి ఇబ్బందులు వస్తాయి.



ఆహార పదార్థాలు కల్తీ : ఈకాలంలో ఆహార పదార్థాలు బాగా కలుషితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కలుషిత ఆహారం తిన్నప్పుడు, నీటిని తాగినప్పుడు కడుపులో నొప్పి, వికారం కలుగుతుంది. వాంతులు అవుతుంటాయి. శరీరంలో బలహీనంగా అనిపించటం మొదలవుతుంది.

కడుపులో నొప్పి : జీర్ణక్రియ బలహీనంగా ఉండటం వల్ల కడుపునొప్పి సాధారణంగానే వస్తుంది. విరేచనాలు, వాంతులు ఈ సీజనల్‌లో తరచుగా వస్తుంటాయి. తినే ఆహారం, తాగే పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

పాదాల పగుళ్లు : చాలామందికి పాదాల పగుళ్ల సమస్య ఎదురవుతుంది. దీనివల్ల పాదాలు నొప్పిగా ఉండటం, నడవడం ఇబ్బందిగా ఉంటుంది. కాళ్లు పొడిబారుతాయి. ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగిసే మడమల దగ్గర చర్మానికి పగుళ్లు వస్తాయి.

సేకరణ : కొంచాడ మహేశ్వరరావు,
పొందూరు మండల విలేకరి,
శ్రీకాకుళం జిల్లా



సందేశాత్మక చిత్రం 'భగవంత్ కేసరి'

అనిల్ రావిపూడి

తాను ఏ సినిమా తీసినా అందులో సామాజికపరమైన అంశాలు ఖచ్చితంగా సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా ఉంటాయని ప్రముఖ సినీ దర్శకులు అనిల్ రావిపూడి చెప్పారు. నందమూరి బాలకృష్ణ అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో వచ్చిన సినిమా 'భగవంత్ కేసరి'. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గానూ, హీరోయిన్ శ్రీలీల కీలక పాత్ర పోషించారు. భగవంత్ కేసరి దసరా కానుకగా ఈనెల 19న విడుదలైన విషయం తెలిసిందే. విజయోత్సవ యాత్రలో భాగంగా హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరులో చిత్ర యూనిట్ బృందం పర్యటించింది. విజయవాడలోని ఓ హోటల్‌లో శనివారంనాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అనిల్ రావిపూడి మాట్లాడారు. హీరో బాలకృష్ణ ఈ సినిమాలో చాలా మంచి పాత్ర పోషించారన్నారు. 'మిగతా సినిమాలతో పోలిస్తే బాలయ్య సినిమాల్లో డ్యాన్సులు ఉంటాయి. ఈ సినిమాలో దానికి ప్రాధాన్యత తగ్గించాము. మహిళా సమస్యలు, వారి సాధికారిత వంటి అంశాలకే ప్రాధాన్యత ఇచ్చాం. తద్వారా ఈ సినిమాలో డ్యాన్సులకు ప్రాధాన్యత తగ్గించాం. మా సినిమాలో ఇచ్చిన 'గుడ్ టచ్..బ్యాడ్ టచ్'లపై ఇచ్చిన సందేశం నేడు సామాజిక మాధ్యమాల్లో బాగా చక్కెర్లు కొడుతోంది. పోలీసులు, ఉపాధ్యాయులు,ఇతర సామాజిక వ్యక్తులు ఈ సందేశాన్ని లక్షలాదిమందికి పంపిస్తుండటం మాకు ఎంతో సంతోషం కల్గుతోంది' అని అన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ తన కెరీర్‌లోనే అత్యుత్తమ చిత్రంగా నిలిచిపోయిందన్నారు. ప్రొడ్యూసర్లు సాహు గారపాటి, హరీష్ పెద్ది, చిత్రబృందం ప్రతినిధులు శ్రీనివాస్, మురళి, సాయికృష్ణ తదితరులు మాట్లాడారు. భగవంత్ కేసరి సినిమాను ఆదరిస్తున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

'ప్రేమకథ' ఫస్ట్ లుక్ రిలీజ్



కిషోర్ కేఎస్ డి, దియా సితెపల్లి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ప్రేమకథ'. టాంగా ప్రొడక్షన్స్ ఎల్ఎల్ పీ, సినీ వ్యాలీ మూవీస్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఉపేందర్ గౌడ్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శివశక్తి రెడ్ డీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను డైరెక్టర్ హరీశ్ శంకర్ రిలీజ్ చేశారు. వైవిధ్యమైన లవ్ స్టోరీతో నేటితరం యువ ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు దర్శకుడు శివశక్తి మాట్లాడారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. త్వరలో థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

'టెనెంట్' గ్లింప్స్ విడుదల



సత్యం రాజేశ్ హీరోగా నటించిన 'టెనెంట్' మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజాగా ఈ మూవీ టైటిల్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదలచేసింది. మహాతేజ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రం మన చుట్టూ జరిగే సంఘటనలకి దగ్గరగా ఉండే ఒక సింపుల్ ఫ్యామిలీ ఎమోషనల్ మర్డర్ మిస్టరీ కథ. మొగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు' చిత్రానికి దర్శకత్వం వహించిన వై. యుగంధర్ దర్శకత్వం వహించారు. స్క్రీన్‌ప్లే, సంభాషణల్ని కూడా అందించారు.



నవంబరులో 'ప్రవీణ్ ఐపీఎస్'

ఐపీఎస్ మాజీ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ జీవితం ఆధారంగా ఓ సినిమా తెరకెక్కింది. నీల మామిడాల నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా 'ప్రవీణ్ ఐపీఎస్' టైటిల్‌తో రాబోతోంది. షూటింగ్ అంతా పూర్తి చేసుకుని ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. నవంబరులో థియేటర్లలోకి తీసుకురానున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి గ్లింప్స్ వీడియో విడుదలైంది. నందకిషోర్, రోజా హీరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దుర్గా దేవ్ నాయుడు దర్శకుడు.

'ఉపేంద్ర గాడి అడ్డా' అలరిస్తుంది



ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'. కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ జంటగా నటిస్తున్నారు. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో తెరకెక్కుతోంది. తాజాగా ఈ చిత్రం టీజర్‌ని సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ విడుదల చేశారు. 'మొదట్నుంచి నాకు సినిమా పిచ్చి ఉండేది. విడుదలైన అన్ని సినిమాలు చూస్తూండేవాడ్ని. అయితే ఇతర వ్యాపార రంగాలలో బిజీ కావడంతో ఇంతకాలం సినిమా రంగంలోనికి ప్రవేశించలేదు. హీరో కావాలన్న మా అబ్బాయి ఉపేంద్ర ఆసక్తిని గమనించి, అతనిని హీరోగా పరిచయం చేస్తూ, ఐదు సినిమాలను మొదలు పెట్టాం. అవన్నీ వివిధ దశలలో ఉన్నాయి. ఐదవ సినిమాగా మొదలు పెట్టిన ఈ సినిమా చాలా వేగంగా పూర్తయి, మొదటి సినిమాగా విడుదలకు సిద్ధమైంది. పూర్తి వినోదం, మాస్ అంశాలతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచేవిధంగా రూపొందింది' అని నిర్మాత తెలిపారు.

సెమీస్ రేసులోకి ఆసీస్

- ఆస్ట్రేలియా ఖాతాలో నాల్గో విజయం
- ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై ఐదు పరుగుల తేడాతో గెలుపు



19 ఓవర్లలో 175పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన వార్నర్-హెడ్

ధర్మశాల: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో పరుగుల వరద పారింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల వేదికగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్లు కలిపి ఏకంగా 771పరుగులు చేశాయి. భారీ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 5 పరుగుల తేడాతో నెగ్గి ఊపిరి పీల్చుకుంది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 389 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ జట్టు చివరి బంతి వరకు పోరాడింది. చివరి బంతికి 6 పరుగులు కొడితే విజయం కివీస్‌ను వరిస్తుందనుకున్న దశలో బౌల్ట్ నేరుగా ఫీల్డర్ వద్దకు బంతిని కొట్టడంతో ఓటమిపాలైంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు వార్నర్-హెడ్ అద్భుత ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 19ఓవర్లలో 175పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారీస్కోర్‌కు పునాది వేశారు. వార్నర్(81) అర్ధసెంచరీ, హెడ్(109) సెంచరీతో కదం తొక్కారు. వీరిద్దరూ ఔటయ్యాక న్యూజిలాండ్ బౌలర్లు సమిష్టిగా రాణించారు. చివర్లో మ్యాక్స్‌వెల్(41), ఇంగ్లిస్(38), కమిన్స్(37) ధనాధన్ బ్యాటింగ్ తోడవ్వడంతో ఆస్ట్రేలియా జట్టు 49.2 ఓవర్లలో 388పరుగులకు కుప్పకూలింది. బౌల్ట్ చివరి ఓవర్లో ఏకంగా మూడు వికెట్లు తీసి ఆసీస్‌ను కట్టడి చేశాడు. ఫిలిప్‌కు మూడు, సాంట్నర్‌కు రెండు, హెన్రీ, నీషమ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో భాగంగా కివీస్ ఇన్నింగ్స్‌లో హైలైట్ అంటే రచిన్ రవీంద్ర సెంచరీనే. రవీంద్ర కేవలం 89బంతుల్లో 9ఫోర్లు, 5సిక్సర్ల సాయంతో 116 పరుగులు చేశాడు. అంతకుముందు, డెవాన్ కాన్వే(28), విల్ యంగ్(32) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్ (54) జోడీ భారీ భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఆసీస్‌కు దూరం చేస్తున్నట్టే కనిపించింది. చివర్లో ఆల్ రౌండర్ జిమ్మీ నీషామ్ భారీ షాట్లతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చివేశాడు. నీషామ్ 39బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 58 పరుగులు చేసి 9వ వికెట్‌గా వెనుదిరిగాడు. నీషామ్ క్రీజులో ఉన్నంత సేపు న్యూజిలాండ్ గెలుపుకు చేరువవుతూ వచ్చింది. చివర్లో ఆసీస్ ఫీల్డర్లు కొన్ని బౌండరీలను అద్భుతంగా ఆపి కివీస్ విజయాన్ని అడ్డుకున్నారు. రెండు బంతుల్లో 7 పరుగులు తీయాల్సిన దశలో నీషామ్ రనౌట్ కావడం కివీస్ ఓటమికి కారణమైంది. కాగా, ఈ విజయంతో ఆసీస్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ట్రెవిస్ హెడ్‌కు లభించింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
భారత్ × ఇంగ్లండ్
(వేదిక: లక్నో; మ.2.00గం॥ల నుంచి)

బంగ్లాకు నెదర్లాండ్స్ ఝలక్

87పరుగుల తేడాతో నెగ్గిన డచ్ జట్టు



కోల్‌కతా: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ మరో సంచలనానికి తెరలేపింది. శుక్రవారం ఈడెన్‌గార్డెన్స్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 87పరుగుల తేడాతో నెగ్గి రెండో సంచలనం సృష్టించింది. తొలుత దక్షిణాఫ్రికాపై 38పరుగుల తేడాతో నెగ్గి డచ్ జట్టు తొలి సంచలనానికి తెరలేపిన సంగతి తెలిసిందే. ఇక బంగ్లాదేశ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 229పరుగులకు ఆలౌటైంది. ఎడ్వర్డ్స్(68), బర్రెసి(41) బ్యాటింగ్‌లో రాణించారు. షోరిఫుల్, తస్కిన్, ముస్తాఫిజుర్, మెహిదీ హసన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లా జట్టు 42.2ఓవర్లలో 142పరుగులకే కుప్పకూలింది. మెహిదీ హసన్(35), మహ్మదుల్లా(20), ముస్తాఫిజుర్(20) పరుగులతో రాణించారు. నెదర్లాండ్స్ బౌలర్లు మీకెరన్‌కు నాలుగు, లీడేకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మీకెరన్‌కు లభించింది.

111 పతకాలతో 5వ స్థానంలో భారత్

- ముగిసిన ఆసియా పారా క్రీడలు

హాంగ్జౌ: 4వ ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్లు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచారు. చైనాలోని హాంగ్జౌలో శనివారంతో ముగిసిన ఆసియా పారా క్రీడల్లో భారత్ ఈసారి రికార్డుస్థాయిలో 111పతకాలు చేజిక్కించుకొని సత్తాచాటింది. ఈ క్రీడల చరిత్రలో భారత్‌కు ఇన్ని పతకాలు దక్కడం ఇదే తొలిసారి. ఇందులో 29స్వర్ణ, 31రజత, పతకాలతో పాటు మరో 51 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక చివరిరోజు భారత్‌కు 12పతకాలు దక్కాయి. ఇందులో మహిళల పారా చెస్‌లో సంకృతి, హిమాన్షు, వృద్ధి కాంస్య పతకాన్ని సాధించారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో సౌందర్య ప్రధాన్ రజతంతోపాటు పురుషుల టీమ్ బి-1 కేటగిరీలో అశ్విన్, దర్పన్, సౌందర్య స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్నారు. ఇక పురుషుల పారా జావెలిన్‌లో నీరజ్ యాదవ్(స్వర్ణం), టెక్‌చంద్(కాంస్యం) సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ స్కల్స్ పిఆర్-3లో నారాయణ, అనిత రజతం పతకం సాధించడంతో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 111కు చేరింది. 2018 జకార్తా వేదికగా జరిగిన ఆసియా పారా క్రీడల్లో భారత్‌కు 72పతకాలు మాత్రమే దక్కగా ఈసారి మరో 39పతకాలు అధికంగా వచ్చాయి. అథ్లెటిక్స్ విభాగంలోనే ఈసారి ఏకంగా 55పతకాలు దక్కడం మరో విశేషం. ఈ సందర్భంగా భారత పారా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు దీపా మాలిక్ మాట్లాడుతూ.. భారత్‌కు అత్యధిక పతకాలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పతకాల పట్టిక(టాప్-10)

వ.స	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	214	167	140	521
2.	ఇరాన్	44	46	41	131
3.	జపాన్	42	49	59	150
4.	ద.కొరియా	30	33	40	103
5.	ఇండియా	29	31	51	111
6.	ఇండోనేషియా	29	30	36	95
7.	థాయ్‌లాండ్	27	26	55	108
8.	ఉజ్బెకిస్తాన్	25	24	30	79
9.	ఫిలిప్పీన్స్	10	4	5	19
10.	హాంకాంగ్	8	15	24	47



రోయింగ్‌లో రజతం పతకం నెగ్గిన నారాయణ, అనిత

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68